honeybee.org
Vol-10 Issue-4

సంపుటి 10 సంచిక 4 మే - జూన్ 2022

# పల్లెసృజన

www.pallesrujana.org

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక







# 'రూరల్ ఇంటర్న్‌షిప్' – ఒక సామాజిక అవసరం



'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్' అన్నారు మహాకవి గురజాడ. మనుష్యుల మనుగడ, వారి నిత్య అభివృద్ధి, వారి అవసరాల ఏర్పాటు, తరాల అభివృద్ధికి విద్య, శిక్షణ, సుఖ జీవనానికి వైద్యం, సంపాద నకు పటిష్ట ఆర్థిక వ్యవస్థ, ఆధ్యాత్మిక ఆనందానికి మతపరమైన వసతులు.... ఇవన్నీ కలిస్తే దేశాభివృద్ధి జరుగుతుంది. సీనియర్ తరం – జూనియ ర్ తరాలను, మార్గదర్శకం చేయడం దేశ భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగ పడు తుంది. అలాంటి మార్గదర్శకాల్లో ఒకటి విద్యార్థులకు 'ఇంటర్న్‌షిప్'.

ఇంటర్న్‌షిప్ ముఖ్యంగా కళాశాల విద్యార్థులకు పరిశ్రమల్లో ఆసుపత్రుల్లో, కోర్టుల్లో, ప్రభుత్వంలో జరుగుతున్నాయి. ఇలా జరగడం వల్ల కాలేజీ విద్యార్థులు సమాజానికి దూరమవుతున్నారు. సమాజంలో ప్రముఖ భాగమైన గ్రామాలు, అడవులు, ప్రకృతి నుండి వారిని వేరు చేయడంలో గత 75 సంవత్సరాల్లో పూర్తిగా సఫలమయ్యాం. ఈ తీరు దేశ భవిష్యత్తుకు తోడ్పడదు. అందుకే 'రూరల్ ఇంటన్స్‌షిప్' గత అయిదు సంవత్సరాల నుండి సిలబస్‌లో 'ఏఐసిటిఇ' జోడించింది. కళాశాలలకు, విశ్వ విద్యాలయాలకు రూరరల్ ఇంటర్న్‌షిప్ ఎలా చేయాలో తెలీదు అందుకే అమలు కావటం లేదు.

పై పరిస్థితిని గమనించిన పల్లెసృజన తమకున్న గ్రామ ప్రజల ప్రకృతిలో సంయమనం పైనున్న అవగాహనతో, అనుభవంతో 'రూరల్ ఇంటర్న్‌షిప్' 2018లో ప్రారంభించింది. 'ఏఐసిటిఇ' కి కూడా ఈ విషయంపై తెలియజేసింది.

గత నాలుగు సంవత్సరాల్లో పల్లెసృజన దాదాపు 2000 మంది విద్యార్థులకు, యువతకు, అధ్యాపకులకు రూరల్ ఇంటర్న్‌షిప్ నిర్వహించింది. ఇవి కోవిడ్ కాలంలో ఆన్‌లైన్ గా కూడా జరిగాయి. ఇప్పుడు తిరిగి గ్రామాల్లో నిర్వహిస్తున్నది. టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ఐఐటి లు, స్థానిక ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్ కాలేజీలు, ఎన్ఎఐఆర్ఎం లాంటి జాతీయ సంస్థలు పల్లెసృజన నిర్వహిస్తున్న రూరల్ ఇంటర్న్‌షిప్‌లో పాల్గొంటున్నారు.

ఈ రూరల్ ఇంటర్న్‌షిప్ యువతకు మన గ్రామాలతో, ప్రకృతితో గ్రామాల ఘనత, సాంప్రదాయ జ్ఞానం, తరతరాలుగా వస్తున్న గ్రామ సమూహ శక్తి, ప్రకృతి పునరుత్పాదన, స్వయం సమృద్ధి, ప్రస్తుత గ్రామాల ఆర్థిక సామాజిక, సాంఘిక దృక్పథాలు, సహజ వనరుల ఉపయోగం, మానవ సంబంధాలు, ప్రకృతితో సహజీవనం, నీటి యాజమాన్యం, వండించనవసరం లేని ఆహారం, కళలు, కులవృత్తులు, గ్రామీణ స్వయం సమృద్ధిపై వాటి ప్రభావం, గ్రామీణాభివృద్ధిలో ఆరోగ్యంలో మహిళల ప్రభావం, పశువులు, పక్షులు, గొర్రెలు, మేకలు వీటి ఉపయోగాలు.... మరెన్నో ఈ "రూరల్ ఇంటర్న్‌షిప్"లో ఉంటాయి. గ్రామ ప్రజల సమస్యలను గమనించి, వాటికి పరిష్కారాలు తయారు చేయడానికి ఈ ఇంటర్న్‌షిప్ ఎంతగానో తోడ్పడుతుంది. మూలికా వైద్యుల జ్ఞానాన్ని తరచి వాటిని ప్రజారోగ్యం కోసం వ్యాప్తి చేసే అవకాశ, విద్యార్థులకు ఉంటుంది. ఈ ఇంటర్న్‌షిప్‌లో ప్రధానంగా విద్యార్థులు స్వయంగా నేర్చుకుంటారు కాబట్టి ఆ జ్ఞానం వారివెంట జీవితాంతం ఉంటుంది. దీనివల్ల భవిష్యత్తులో వారు చేసే నిర్ణయాల గుణత్వం తప్పక అధికంగా ఉంటుదని పల్లెసృజన విశ్వాసం. ఈ ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్న విద్యార్థులు దేశ భవిష్యత్తును సరియైన మార్గంలో, సమానత్వ దృష్టితో నడపడానికి ప్రయత్నిస్తారని మేము సంపూర్ణంగా నమ్ముతున్నాం.

వీరందరికి "రూరల్ ఇంటర్న్‌షిప్' లో పాల్గొనడానికి 'పల్లెసృజన' ఆహ్వానం పలుకుతోంది.

సంపుటి-10 సంచిక - 4 మే - జూన్ 2022

# పల్లెసృజన

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-40253086, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్మలమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**పి. చంద్రకాంత్ శర్మ**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్మలమడక శ్రీకర్**
**కల్పనా శాస్త్రి**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com

**Rs. 400/-**
**for 2 years Subscription**

## ఈ సంచికలో.....

* కారంపొడి యంత్రానికి శ్రమ తగ్గించిన 'కన్నోజు నవీన్' - తల్లి కష్టంలోంచి పుట్టిన ఇన్నోవేషన్ - 4
* మోటార్ సైకిల్ నడిపేవారి నడుం నొప్పులకు పరిష్కారం కోడం సంతోష్ ఇన్నోవేషన్ - 7
* 40వ చిన్నశోధయాత్ర - యాత్రీకుల అనుభూతి - 9
* గ్రామీణ ఇన్నోవేటర్లు - ప్రభుత్వ వ్యవస్థ మధ్య వంతెనగా 'పల్లెసృజన' వాలంటీర్లు - 11
* పునాది స్థాయి ఇన్నోవేషన్లతో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి - 13
* జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు - 18
* ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞానం - 22
* వృక్షాయుర్వేదము - 24
* ఎపిజె అబ్దుల్ కలాం 'ఇగ్నైటెడ్ మైండ్' చిన్న పిల్లల సృజనాత్మక మరియు ఇన్నోవేషన్ పురస్కారాలు - 2022 - 26
* ఆయుర్వేద జ్ఞాన మథనం - 30
* స్పందన - 31

**కవర్ లోపలి పేజీల్లో ...**

'రూరల్ ఇంటర్న్‌షిప్' – ఒక సామాజిక అవసరం.
అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల ఇన్నోవేషన్లు

**మధ్య పేజీలో :**

మే – జూన్ 2022 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix**, 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. -500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank,
Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Nam Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# 75 సంవత్సరాల స్వతంత్ర భారతంలో వ్యవసాయ పోకడలు

'ఆజాదీకా అమృత్ మహోత్సవ్' 75 సంవత్సరాల స్వతంత్ర్య దినోత్సవ సందర్భంగా దేశంలో పండుగ చేసుకుంటున్నాము. ఎన్నో రకాల చర్చలు, సంభాషణలు, ఆర్థిక, సాంఘిక, రాజకీయ కోణాల్లో దేశం సాధించిన మైలు రాళ్లను కూలంకషంగా సమీక్షించడం, నిశితంగా దేశం అవలంభించిన విధి విధానాలు, ప్రజల శ్రేయస్సు అన్ని రంగాలలో అభివృద్ధి పథకాల గురించి దేశమంతా ప్రభుత్వ ప్రైవేటు రంగాలలోనూ, మేధావుల సమూహాల్లోను, వ్యక్తిగత విశ్లేషణలు, మీడియాలో చర్చలు అనర్గళంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంలో 'పల్లెసృజన' పాఠ్యాన్ని కొన్ని చర్చల్లోని ముఖ్యాంశాలు పాఠకుల ముందుకు తీసుకు రావాలని కోరుకుంటున్నది. వ్యవసాయ రంగం గ్రామీణాభివృద్ధిపై కేంద్రీకృతమై ఉంటుంది. ఈ అంశాలు "వ్యవసాయ గణాంకాలు-2020" పేరిట కేంద్ర ప్రభుత్వ ఆర్థిక గణాంక శాఖ నుండి తీసుకొనబడినవి.

2011 జనాభా లెక్కల ప్రకారం దాదాపు 69 శాతం దేశ జనాభా మరియు 72 శాతం కార్మికులు గ్రామాల్లో నివసిస్తున్నారు. దేశ స్థూలిక ఉత్పత్తిలో గ్రామాల వంతు గత 75 సంవత్సరాల్లో గణనీయంగా మారలేదు. కాని వ్యవసాయ రంగం ఇప్పటికీ కూడా కార్మిక వర్గానికి ఉద్యోగావకాశంలో 60 శాతం ముందుగానే ఉంది. దేశ భౌగోళిక వైశాల్యం 328.7 మిలియన్ హెక్టార్లు, ఇది ప్రపంచ భూమి వైశాల్యంలో 2.4 శాతం మాత్రమే. ఇందులో 264.5 హెక్టార్లు వ్యవసాయము, అడవులు, మైదానాలు, చేపల పెంపకం కొరకు వాడుకంలో ఉంది.

రైతుల కమతాల పైజల విషయంలో చిన్న, సన్నకారు రైతులు ( 2 హెక్టార్లకంటే తక్కువ భూమిని స్వంతంగా చేసుకునేవారు) 1970-75లో దాదాపు 5 కోట్లు ఉంటే, 2015-16లో ఇది 12.6 కోట్లకు పెరిగింది. దేశ మొత్తంలో 68 శాతం ఈ వర్గమే ఉన్నారు. అలాగే 15 హెక్టార్లకంటే ఎక్కువ ఉన్న రైతులు ఈ 45 సంవత్సరాల్లో 28 లక్షల నుండి 8 లక్షలకు తగ్గారు. 2015-16 గణాంకాల ప్రకారం 86 శాతం రైతులు 2 హెక్టార్లకంటే తక్కువ ఉన్నవారే. వీరి సంఖ్య గత 45 సంవత్సరాల్లో రెండింతల కంటే ఎక్కువే అయ్యింది. అంటే దేశం ఆహార భద్రతకై వీరిపైనే ఎక్కువ ఆధార పడుతుందన్న విషయం స్పష్టంగా కనిపిస్తుంది. అందుకే వ్యవసాయ పాలసీలు, యాంత్రీకరణ, మద్దతు ధరలు, ఋణాలు, వగైరా ఈ సత్యానికి దగ్గరగా ఉండాలి.

నీటి పారుదల రంగంలో బోరునీళ్ళ ఉపయోగం గత 60 సంవత్సరాల్లో 0.5 శాతం నుండి 45 శాతానికి పెరిగింది. అంటే 90 రెట్లు పెరిగిందన్నమాట. అలాగే బోరు నీటితో సాగు వైశాల్యం 216.8 హెక్టార్లకు పెరిగిందని గణాంకాలు చెప్తున్నాయి. చెరువు నీటి ఉపయోగం 10 శాతం నుండి 3 శాతానికి పడిపోయింది. చెరువు నీళ్ళతో పంటలు పండించే భూమి వైశాల్యం కూడా సగానికి సగం తగ్గిపోయింది. కాలవల ఉపయోగం కూడా 26 శాతం నుండి 7 శాతానికి దిగిపోయింది. మొత్తం నీటి పారుదల 6.5 కోట్ల హెక్టార్లుంటే అందులో 2.9 కోట్ల హెక్టార్లు బోరు నీళ్ళతో వ్యవసాయం చేయడం గమనార్హం. పై గణాంకాలలో గమనించాల్సిన విషయాల్లో కొన్ని ప్రధానమైనవి చర్చిద్దాం. కాలవల ఉపయోగం తగ్గిందంటే ఎన్నో కోట్లు ఖర్చు పెట్టిన పెద్ద పెద్ద డ్యాముల ప్రభావం తగ్గుముఖం పడుతుందన్నమాట. రైతులు ముఖ్యంగా భూ జలాలపై ఆధార పడుతున్నారంటే పెద్ద పెద్ద డాముల ఆధారిత వ్యవసాయ పద్ధతి ప్రభావం సన్నగిల్లుతుందన్నమాట. చెరువులు, కుంటలు సంప్రదాయ వ్యవసాయంలో తరతరాలుగా ప్రధాన భాగంగా ఉన్నాయి. వీటివల్ల అనేక లాభాలున్నాయి. మనుషులకు, జంతువులకు, పక్షులకు అన్ని జీవరాసులకు కనిపించే నీరు జీవనాధారంగా ఉండేది. జన సమూహాలు తమతమ చెరువులను ప్రతి సంవత్సరం చక్కదిద్దుకునేవారు. నీటి పంపకంపై వ్యత్యాసాలు లేకుండా సమ పంపకాలు చేసేవారు. ఇవన్నీ క్రమక్రమంగా తగ్గిపోవడం వలన సమాజంపై విపరీత సాంఘిక, ఆర్థిక ప్రభావాలు, నష్టాలు ఎక్కువ అవుతున్నాయి. వికేంద్రీకరణ పద్ధతిలో జరిగే నీటి ఉపయోగానికి బ్రిటీష్ కాలంలోనే వినాశం మొదలైంది. స్వాతంత్ర్యం తర్వాత కూడా ఈ విధానం కొనసాగుతూ వచ్చింది. ఇది మారాలి. నీటి నిలవ, వాడి ఉపయోగం ప్రజా సమూహాలే నిర్ణయించాలి. దానికి సరియైన తోడు ప్రభుత్వం సమకూర్చాలి.

1960-61లో 15 శాతం మానవ శక్తి, 75 శాతం పశు శక్తి, యంత్రాలు, ఇంజన్లు 7 శాతం వాడడం జరిగింది. 2013-14 గణాంకాల ప్రకారం మానవ శక్తి 5 శాతం, పశువుల శక్తి 7 శాతం,



ట్రాక్టర్లు 48 శాతం, డీజిల్ 17 శాతం, కరెంటు 22 శాతం వాడకంలో ఉందని తెలుస్తున్నది. ఈ విధంగా గత 60 సంవత్సరాల్లో మానవ శక్తి, పశు శక్తి వాడకం భారీగా తగ్గి, వాతావరణానికి సుముఖంగా లేని డీజిల్ కరెంటు వాడకాలు విపరీతంగా పెరిగాయి. దీంతో రైతుల పెట్టుబడి ఖర్చులు ఎన్నో రెట్లు పెరిగి, వారి లాభాలను క్రమక్రమంగా తగ్గిస్తూ వచ్చాయి.

మెకనైజేషన్ అంటే ట్రాక్టరైజేషన్ అన్నట్లుగా తయారైంది. యాంత్రీకతలో సరియైన శక్తి, అందుబాటు ధర, సన్న, చిన్నకారు రైతులకు తోడునిచ్చి, వారి వ్యవసాయ జీవన విధానాన్ని అభివృద్ధి పథంలో తీసుకుపోయేలా చేయడం జరగలేదు. గత పది సంవత్సరాల్లో సోలార్ శక్తి రావడంతో కొంత ఊరటగా ఉన్నా మానవ - పశువుల శక్తిని తిరిగి పెద్దయెత్తున వాడకానికి కృషి చేయాలి. రైతులకు పనిముట్లు, పశువులు లాగే చిన్న చిన్న యంత్రాలు, ప్రతి పంటకు ఆవిష్కరించి, వికేంద్రీకరణ పద్ధతిలో వాటిని తయారు చేసి దేశమంతా అందేలా చేయడం రైతుల అభివృద్ధికి అత్యవసరం.

1971లో దేశంలోని కార్మికవర్గంలో 62.2 శాతం వ్యవసాయదారులు ఉండేవారు. అందులో 38 శాతం వ్యవసాయ కూలీలు. 2011 గణాంకాల ప్రకారం వ్యవసాయదారుల సంఖ్య 55 శాతానికి తగ్గింది. కాని వ్యవసాయ కూలీల సంఖ్య 55 శాతానికి పెరిగింది. దీనికి రైతుల స్వంత భూమి తగ్గిపోవటం, ఆ స్వల్ప విస్తీర్ణంలో లాభసాటి వ్యవసాయం చేయలేకపోవటం కారణాలు అయ్యుంటాయి. దీంతో వీరు వ్యవసాయేతర పనుల్లోకి వెళ్ళడం లేక వ్యవసాయ కూలీలు కావడం జరిగినట్టు తెలుస్తుంది. వ్యవసాయంలో మహిళల భాగస్వామ్యం పెరిగినట్టుగా కనిపిస్తున్నది. 2011వ సంవత్సరంలో మహిళలు 33 శాతం వ్యవసాయదారులుగా, 47 శాతం వ్యవసాయ కూలీలుగా ఉన్నారు. 2018-19లో మహిళల భాగస్వామ్యం 71 శాతానికి పెరిగిందని అంచనా. దేశ మొత్తంలో మహిళల భాగస్వామ్యం ముఖ్యంగా పంటల పెరుగుదల, పశువుల పెంపకం, పండ్ల తోటలు, పంట కోసిన తర్వాత పనులు, చేపల పెంపకం వగైరాలలో ఎక్కువగా ఉన్నదని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంచనా వేశారు. దీనికి ప్రధాన కారణం మగరైతులు పట్టణ వలసలకు పోవడం కావచ్చుని భావిస్తున్నారు. ఏదైనా మహిళల భాగస్వామ్యం వ్యవసాయంలో ఎక్కువ కావడం ఒక శుభసూచకం. వీరే భవిష్యత్‌లో పౌష్టిక ఆహారానికి, స్వయంప్రతిపత్తి గల అభివృద్ధికి తోడ్పడతారని అందరి విశ్వాసం.

పంటల ఎన్నికలో రైతులు గత 70 సంవత్సరాల్లో చాలా మార్పులు తెచ్చారు. ధాన్యం 24 నుండి 22 శాతానికి తగ్గింది. మొక్కజొన్న 2.5 నుండి 5 శాతానికి పెరిగింది. చిరుధాన్యాలు 37 నుండి 30 శాతానికి తగ్గాయి. పప్పులు 77 నుండి 64 శాతానికి వచ్చాయి. పండ్లు, కూరగాయలు 1.7 నుండి 4.8 శాతానికి పెరిగాయి. మొత్తం ఆహార పంటలు 1950-51లో 81 శాతం ఉండగా, 2010-11లో అవి 73.4 శాతానికి తగ్గటం జరిగింది. కొబ్బరి, నూనెగింజలు 8.3 నుండి 14.6 శాతానికి పెరిగాయి. ఆహారేతర పంటలు 18.8 నుండి 26.6 శాతానికి పెరిగాయి. విశేషజ్ఞుల విశ్లేషణ ప్రకారం రైతులు వ్యాపార పంటల వైపు మొగ్గుతున్నారని అభిప్రాయ పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ పాలసీలు, యాంత్రీకరణ, ప్రాసెసింగ్ పద్ధతులు వికేంద్రీకరణ చేయడం సబబుగా ఉంటుంది.

రసాయన ఎరువుల వాడకం వల్ల దిగుబడి పెరుగుతుందన్న రైతుల నమ్మకాలను ప్రభుత్వ గణాంకాలు వమ్ము చేస్తున్నాయి. ఎరువులకు పంట స్పందన (కేజీ ధాన్యానికి కేజీ రసాయన ఎరువుల వాడకం) 1960-69 దశాబ్దంలో 12 నుండి 2010-17లో 5 శాతానికి పడిపోయింది. ఉత్పాదకత భూమిలో తగ్గిపోయింది కానీ రైతుల రసాయన ఎరువుల ఉపయోగం స్పష్టంగా పెరిగింది. జాతీయ స్థాయిలో రసాయన ఎరువులు (ఎన్‌పికె) వాడకం 1961-62లో 2 కి./హెక్టారు ఉండగా 2018-19లో 134 కి./హె.కు చేరుకుంది. ఈ పద్ధతిలో ఎరువుల వ్యర్థ ఉపయోగం వాటి తయారీల ఖర్చులు, వాతావరణంపై విపరీత ప్రభావాలు, వ్యర్థమైన సబ్సిడీలు ఇవన్నీ కూలంకషంగా పరిశీలిస్తే, దేశానికి, రైతులకు, భూమికి, వాతావరణానికి ఎనలేని నష్టం జరిగినట్లు అవగతమవుతుంది.

పై గణాంకాలు జాతీయ స్థాయిలో సేకరించినవి. మన దేశ వ్యవసాయం ఏ దిశలో పయనిస్తుంది అన్న విషయంపై పాఠకుల అవగాహనకై పైన వివరించాం. రైతులు, సమాజ సంస్థలు, రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు, సైన్స్ & టెక్నాలజీ రంగాలు వీటిని సునిశితంగా విశ్లేషించి, భారత ప్రభుత్వం నిర్దేశించిన "ప్రకృతి వ్యవసాయం" దేశమంతా రైతులకు లాభాలతో అమలు చేయడానికి సంపూర్ణ కృషి చేయాలి. అందరూ కలసి ఈ గమ్యాన్ని సాధించాలి.

భవదీయ

బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)



## కారంపొడి యంత్రానికి శ్రమ తగ్గించిన కన్నోజు నవీన్

# తల్లి కష్టంలోంచి పుట్టిన ఇన్నోవేషన్

- వీరరాఘవ రెడ్డి

ఏదో ఒకటి సాధించాలి అనుకునే వ్యక్తులకు అవకాశాలు వాటంతట అవే వస్తాయి అనటానికి ఒక ఉదాహరణ ఈ ఇన్నోవేటర్ 'కన్నోజు నవీన్', ఖమ్మం జిల్లా, పెద్ద మండవ గ్రామానికి చెందిన కన్నోజు కనకాచారి, సుజాతమ్మల కుమారుడు. ఇతనికి 6వ తరగతి చదువు తున్నప్పుడే ఏదైనా సమస్యకు పరిష్కారం వెతకటం అంటే చాలా ఇష్టంగా అలవాటు చేసుకున్నాడు. ఇప్పటికే పంట పొలాల్లో అంతర సేద్యాలు చేసే వీడర్, వరి నాటు వేసే యంత్రం, పంటలపై పురుగు మందు పిచికారి చేసే డ్రోన్ చేశాడు. తాను చేయాలనుకున్న పరికరానికి తానే డిజైనింగ్, డ్రాయింగ్ స్వంతంగా వేసుకుంటాడు. వినాయక విగ్రహాలను కూడా చేస్తూ ఉంటాడు. తండ్రి వెల్డింగ్ పనులు చేస్తూ, అమ్మ కారం పొడి పట్టే మిషన్ నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటారు.

సాధారణంగా గ్రామాల్లోనైనా, పట్టణాల్లోనైనా సరే కారం పొడిని పట్టే పిండిమరల వద్ద కారంపొడి కొరకు వచ్చిన మిరప యజమానులు ఉండరు. అక్కడ కేవలం పిండిమర యజమాని మాత్రమే ఉండి, కారం పొడి పట్టించి, యజమానికి అందిస్తూ ఉంటాడు. అందుకు కారణం కారం పొడి వాసనను భరించలేక పోవటమే. అంత ఘాటైన వాసనను ప్రతిరోజూ భరించలేక ఎంతోమంది అనారోగ్యం పాలైన వారితో పాటు, కొంతమంది మరణించటం కూడా జరిగింది.

కారం పొడి పట్టే పిండిమరలు కూడా జొన్న పిండి పట్టే మర లగానే ఉంటాయి. జొన్నలు యంత్రం పైన పోసిన తర్వాత తగు మోతాదులో అవి పిండిమర లోపలికి వెళ్ళేలా ఏర్పాటు చేస్తారు, అవి సులభంగా క్రిందకు జారుతూ ఉంటాయి, పిండి క్రిందకు వస్తుంది. కానీ, మిరపకాయ అలా కాదు. కాయలు యంత్రం లోనికి ఒక్కోసారి వెళ్ళవు కాబట్టి అక్కడ మనిషి ఉండి వాటిని ఒక కర్రతో లోపలికి నెట్టాల్సి ఉంటుంది. ఒక్కోసారి ఎక్కువ కాయలు లోపలికి వెళ్ళినప్పుడు బయటకు కూడా కొన్ని కాయలు అలాగే క్రిందకు వచ్చేస్తూ ఉంటాయి. అందుకే ఒకసారి కారం పిండి పట్టిన తర్వాత మళ్ళీ ఆ పిండిని యంత్రంలో 2వసారి వేస్తే అప్పుడు మెత్తటి పిండి క్రిందకు వస్తుంది. ఇలా చేయాలంటే ఎంతో ఘాటైన కారం పొడి ముక్కు రంధ్రాల ద్వారా గుండెలకు చేరి, ఆహార నాళం మొత్తం మంటగా తయారౌతుంది. దగ్గు ఎక్కువగా వస్తుంది. ఆ మంట ఒక్కోసారి గుండెలకు కూడా చేరుతుంది. మర ఆడించే మనుషులు త్వరగా అనారోగ్యానికి గురవుతూ ఉంటారు.

> కారం పిండి పట్టిన తర్వాత మళ్ళీ ఆ పిండిని యంత్రంలో 2వసారి వేస్తే అప్పుడు మెత్తటి పిండి క్రింద కు వస్తుంది. ఇలా చేయాలంటే ఎంతో ఘాటైన కారం ముక్కు రంధ్రాల ద్వారా గుండెలకు చేరి, ఆహార నాళం మొత్తం మంటగా తయారౌతుంది. దగ్గు ఎక్కువగా వస్తుంది. ఆ మంట ఒక్కోసారి గుండెలకు కూడా చేరుతుంది.

ఇన్నోవేటర్ నవీన్ ప్రస్తుతం పాలిటెక్నిక్ విద్యను అభ్యసిస్తున్నాడు. దిగువ మధ్య తరగతి కుటుంబానికి చెందిన వాడు. తన తల్లి దండ్రులు ఈ కారం పొడి యంత్రం వల్ల విపరీతంగా అనారోగ్యానికి గురవుతున్నారని గ్రహించాడు. కారం పొడిని ఒకసారి పట్టిన తర్వాత మళ్ళీ తిరిగి పిండి మెత్తగా, ఎటువంటి కాయలు లేకుండా రావటం కోసం రెండవసారి యంత్రంలోకి పోయుటం వల్ల వీళ్ళు ఎక్కువగా అనారోగ్యానికి గురవుతున్నారు అని గ్రహించాడు. చిన్నప్పటి నుండి సృజనాత్మక ఆలోచనలు కలిగి, ఎన్నో రకాల ఇన్నోవేషన్లను తయారు చేసిన నవీన్ ఈ సమస్యకు ఎలాగైనా పరిష్కారం కనుగొని, తన తల్లిదండ్రులకు కాస్తయినా ఆరోగ్యంగా ఉండేలా చూడాలి అనుకున్నాడు.

తనకున్న సృజనాత్మక శక్తితో ఈ యంత్రం ఎలా చెయ్యాలా? అని ఎన్నోసార్లు ఆలోచించాడు. మిరప కాయలు అలాగే యంత్రంలో వెయ్యటం వల్ల అవి ఒక్కోసారి లోపల వున్న మరలకు అందకుండా, నేరుగా పిండితో పాటు కొన్ని కాయలు బయటకు

వస్తున్నాయి అని గ్రహించాడు. ఇలా కాయలు నేరుగా పిండిమరలో వెయ్యకుండా వాటిని కాస్త నజిగిజిగా ముక్కలు చేసి యంత్రానికి అందించ గలిగితే, చిన్న చిన్న ముక్కలు గా వున్న మిరప కాయలు నేరుగా మరలోకి వెళ్ళి ఒకేసారి మెత్తటి కారం పొడి బయటకు వస్తుంది అన్న ఆలోచన తట్టింది.

ఈ సమస్యకు పరిష్కారంగా ఒక అదనపు పరికరాన్ని తయారు చేశాడు. వినియోగదారులు తెచ్చిన మిరప కాయలను ఆ పరికరంలో వేసినట్లయితే వాటిని ఆ పరికరం చిన్న చిన్న ముక్కలుగా చేసి, నేరుగా దానంతట అదే పిండిమర లోపలికి వెళ్ళేలా ఏర్పాటు చేశాడు. తన మిత్రుల ద్వారా 'పల్లెసృజన' గురించి తెలుసుకొని, వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం గారి సహకారంతో మొదటి ప్రయత్నంలోనే కొంత వరకు సఫలీ కృతుడు అయ్యాడు. ప్రయోగంలో తను కనుగొన్న చిన్న చిన్న అవరోధాలను తొలగించి, చివరికి విజయవంతంగా తన ఇన్నోవేషన్‌ను పూర్తి చేశాడు. ఇప్పుడు తన తల్లిదండ్రులు కారాన్ని రెండుసార్లు యంత్రంలో వేయాల్సిన అవసరం





లేదు. ఒకేసారిగా మెత్తటి పొడి వినియోగదారుడికి అందుతుంది.

పగటిపూట కరంటు కొరత వల్ల కారంపొడి యంత్రాన్ని నడిపించడం కష్టంగా ఉంది. దీనికై నవీన్ ఒక 5 హార్స్‌పవర్ ఇంజన్‌ను దీనికి జోడిస్తే కరంటుపై ఆధార పడకుండా రోజంతా ఈ యంత్రం నడపవచ్చని విశ్వసిస్తున్నాడు. ఈ పరికరం తయారు చెయ్యటం వల్ల నవీన్ తల్లిదండ్రులకు ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా, తక్కువ శ్రమతో పని పూర్తయింది. పైగా కారం ఘాటు ముక్కు పుటాల్లోకి వెళ్ళటం తగ్గటం వల్ల వారు కూడా ఆరోగ్యంగా తమ దైనందిన కార్యక్రమాలు చేసుకుంటున్నారు.

చూడటానికి చిన్న ప్రయోగంలా అనిపించినా దీనివల్ల తన తల్లిదండ్రుల ఆరోగ్యమే కాదు, దాదాపు ప్రతి గ్రామంలో ఉండే కారం పట్టే యంత్రాల యజమానులకు కూడా ఆరోగ్యప్రదాతగా మారాడు మన ఇన్నోవేటర్ నవీన్. ఈ పరికరం తయారు చేయటానికి రూ. 15 వేల వరకు ఖర్చవుతుంది. ప్రతి గ్రామంలో, పట్టణాల్లో కారం పొడి పట్టే యంత్రాల యజమానులు అందరు ఈ పరికరాన్ని కొనుగోలు చేసి, తమ ఆరోగ్యాలను కాపాడుకోవటంతో పాటు, తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయాన్ని పొందుతారని ఆశిస్తోంది 'పల్లెసృజన'. ఈ యంత్రానికి విస్తృత ప్రాచుర్యం కల్పించి, అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది.

**ఇన్నోవేటర్ 'కన్నోజు నవీన్' ఫోన్ : 96405 92320**

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

National Innovation Foundation-India

## జాతీయ 13 వ ద్వైవార్షిక పోటీలు

పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు



**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 13వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృత్తుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

### ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి బహుమతిగా రూ. 5,00,000, జాతీయ రెండవ బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000లను వివిధ వర్గాలలో ఇవ్వబడును. జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. 7,50,000లు గొప్ప ఇన్నోవేటర్‌కు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును. అంతే కాదు ప్రోత్సాహక బహుమతి క్రింది రూ. 10,000లను వివిధ వర్గాలలో ఎన్నుకోబడిన ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెతికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2023** లోగా మాకు చేరేలా పంపండి.

### దరఖాస్తు దారులకు గమనిక

వ్యక్తిగతంగా కానీ, సమూహంగా కానీ ఎన్ని ఐడియాలనైనా వ్రాసి పంపవచ్చు.
మీ ఐడియా/ ఇన్నోవేషన్/ సాంప్రదాయ జ్ఞానానికి సంబంధించిన సాంకేతిక వివరాలు, ఫొటోలు, వీడియోలు ఏవి వున్నా పంపాలి.
దరఖాస్తుదారుడు తన విద్యార్హతలు, మీ వృత్తి వివరాలను తెలియజేయాలి.
మీ గుర్తింపు కార్డు (ఆధార్/ ఓటర్ కార్డు/ ప్రభుత్వం నుండి పొందిన ఏదైనా) కాపీని తప్పనిసరిగా జత చేయాలి.
మీ పూర్తి పోస్టల్ చిరునామా తప్పనిసరిగా పంపాలి.

**దరఖాస్తు చేయుటకు చివరి తేది 31 మార్చి, 2023**

మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :

**National Innovation Foundation,**
C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.
Phone: (02764) 350001/ 02/ 03/ 04/ 05/ 06 Email: campaign@nifindia.org, Website: www.nif.org.in

సూచన : వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై https://nif.org.in/announcement/biennial_competition సంప్రదించండి. లేదా 'పల్లెసృజన' కార్యాలయాన్ని (ఫోన్ : 040-40253096) సంప్రదించండి.

# మోటార్ సైకిల్ నడిపేవారి నడుం నొప్పులకు 'పరిష్కారం'

## కోడం సంతోష్ ఇన్నోవేషన్



తెలంగాణ రాష్ట్రంలోని సిరిసిల్ల జిల్లా కేంద్రానికి సమీపంలో గల తంగళ్ళపల్లి గ్రామానికి చెందిన కోడం సంతోష్ (వయస్సు 45 సవత్సరాలు) చదువుకున్నది 10వ తరగతి వరకు మాత్రమే. వృత్తిరీత్యా ఫోటో గ్రాఫర్ మరియు వీడియో ఎడిటర్. ఇతను ఫోటోలు తీయాలంటే వినియోగ దారుని వద్దకు వెళ్ళటానికి మోటార్ సైకిల్‌పైన వెళ్ళటం, వీడియో ఎడిటింగ్ చెయ్యాలంటే గంటల తరబడి కదలకుండా కుర్చీలో కూర్చుని పని చెయ్యటం వల్ల విపరీతమైన నడుం నొప్పితో బాధ పడుతూ ఉండేవాడు.

ప్రస్తుతం ఎక్కువ మంది యువకులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కావటం వల్ల ఎక్కువసేపు కూర్చుని నడుం నొప్పులకు గురవుతున్నారు. అలాగే యువతలో ఎక్కువ సంఖ్యలో బైక్‌పైన తిరగటం అలవాటు. అందుకు కారణం కొందరికి జీవనోపాధి అయితే, మరి కొందరికి అదో ఫ్యాషన్. ఏదియేమైనా బైక్‌పైన తిరిగే వాళ్ళకు నడుం నొప్పులు సర్వ సాధారణం అయిపోయాయి. డాక్టర్ల వద్దకు వెళ్తే తప్పక విశ్రాంతి తీసుకోవాలి, వెన్నెముకకు ఆపరేషన్ చెయ్యాల్సి ఉంటుంది అని చెప్తారు. ఆపరేషన్ అంటే ఖర్చుతో కూడుకున్న పని, విశ్రాంతి తీసుకోవాలి అంటే జీవనాధారం కష్టం. మరికొంత మందికి ఇటీవల 'సయాటికా' అనే నొప్పితో నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ నొప్పి వచ్చిన వారిలో ఎక్కువ మందికి కుడికాలు, కొద్ది మందికి ఎడమ కాలు మొత్తం పైనుండి క్రింద పాదం పై వరకు భరించరానంత నొంప్పు ఉంటుంది. ఇందుకు కారణం వెన్నెముకలో ఎల్ 5,6,7 కణుపుల మధ్యనున్న కండరం నరాలనుపై వత్తిడి పెంచడం వల్ల వస్తుంది. ఇది కేవలం ఎక్కువ సేపు కూర్చోవటం, మోటార్ సైకిల్ నడపడం వల్లనే వస్తుంది. ఆపరేషన్ చేసి ఆ పెరిగి నరాలపై వత్తిడి పడే కండరాన్ని ఆపరేషన్ చేసి, కత్తిరించాల్సి వస్తుంది. ఇలా ఇంకెంతో మంది నాలాంటి సమస్యతో బాధ పడతుంటారు అని దీనికి పరిష్కారం ఆలోచించాలి అనుకున్నాడు సంతోష్.

కుర్చీలో వెన్నెముకకు ఆధారం చేసుకుని ఉంటాము కాబట్టి కొంత వరకు నొప్పి తక్కువగానే ఉంటుంది. కానీ, మోటార్ సైకిల్ పైన ఎక్కువ దూరం ప్రయాణిస్తే విపరీతమైన నడుం నొప్పికి గురవుతూ ఉంటాము కాబట్టి మోటాల్ సైకిల్ పైన కూడా వెన్నెముకను ఆనించి కూర్చునేలా ఏదైనా పరిష్కారం కనుగొంటే బావుంటుంది. అనుకున్నాడు. గతంలో 'వెస్పా' అనే స్కూటర్ తయారీదారులు వాహనం నడిపే వారి



నడుం క్రింది భాగం ఆనుకుని వుండేలా చిన్న పరికరాన్ని అమర్చే వాళ్ళు అని గుర్తుకు వచ్చింది. ఇదే ఈ సమస్యకు పరిష్కారం అనుకున్నాడు. తనకు తెలిసిన లేత్ మిషన్ వర్క్‌షాప్ వాళ్ళ వద్దకు వెళ్ళి తన సమస్యను, దానికి పరిష్కారాన్ని గురించి తెలియజేశాడు. వారు సంతోష్ సూచనల మేరకు మోటార్ సైకిల్ పైన డ్రైవర్ వీపు ఆనుకునేలా ఒక సీటును తయారు చేశారు.

ఈ బ్యాక్ రెస్ట్ సీటు అవసరమైనప్పుడు ఆనుకునేలా ఏర్పాటు చేసుకోవచ్చు, అవసరం లేదు అనుకున్నా, లేదా వెనక ఎవరైనా వ్యక్తిని కూర్చోబెట్టుకోవాలి అనుకున్నా ఆ బ్యాక్ రెస్ట్ సీటును వెనక కూర్చున్న వ్యక్తి కూర్చోవటానికి అనుగుణంగా సీటులా మడత పెట్టుకోవచ్చు. ఇలా చేసుకోవటం వల్ల బైక్ పైన కూర్చున్న ఎవ్వరికీ ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఎక్కువ దూరం ప్రయాణించేటప్పుడు ఆ సీటును పైకి లేపి, దానికి ఆనుకుని కూర్చొని కార్లో వెళ్ళినట్లుగా ప్రయాణం చెయ్యవచ్చు. ఇలా ఎంత దూరం ప్రయాణం చేసినా పెద్దగా నడుం నొప్పి అనిపించదు. ఈ విధంగా తన సమస్యకు తానే పరిష్కారం ఆలోచించి, తనకు అవసరమైన పరికరాన్ని తయారు చేయించుకుని, తన మోటార్ సైకిల్‌కు బిగించుకున్నాడు.

ఈవిధంగా చెయ్యటం వల్ల తనకు ప్రస్తుతం నడుం నొప్పి అనేది లేకుండా ఎక్కడికైనా సుఖంగా ప్రయాణం చెయ్య గలుగుతున్నాను అంటాడు సంతోష్. ఈ సీటు కూడా వాహనం నడిపే వ్యక్తి వీపు మొత్తం ఆనుకునేలా ఉండదు. కేవలం వెన్నెముక లోని ఎల్ 4,5,6 లింబ్ లకు విశ్రాంతినిచ్చేలా ఉంటుంది.

సంతోష్ ఇన్నోవేషన్ చూడటానికి చిన్నదైనా, ఎంతోమంది యువకులకు ఆరోగ్యాన్నిస్తుంది. వృత్తిపరమైన అనారోగ్యాలు సమాజంలో అలాగే ఉండిపోతున్నాయి. వీటిపై పరిశోధనలు జరిపి, పరిష్కారాలు రావడం కద్దు. ఈ పరిస్థితుల్లో సంతోష్ ఇన్నోవేషన్ ప్రశంసనీయం.

'పల్లెసృజన' ఇలాంటి గ్రామీణ ఇన్నోవేషన్లను ప్రోత్సహిస్తుంది. వారి ఇన్నోవేషన్లు చిన్నవయినా, విలువైనవి కాబట్టి సమాజానికి తెలిపి, ప్రజలకున్న కొన్ని కష్టాలైనా తగ్గించాలని కృషి చేస్తున్నది 'పల్లెసృజన'. సంతోష్‌కు పూర్తి సహకారాన్ని పల్లెసృజన ఎప్పుడూ అందిస్తూనే ఉంటుంది.



ఇన్నోవేటర్ సంతోష్ ఫోన్ : 93464 35141

## సమస్యలకు ఆహ్వానం

'పల్లెసృజన' ఇంతవరకు సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు (ఇన్నోవే షన్‌లను) వెతికి, వెలుగులోకి తీసుకు రావడానికి స్వచ్ఛందంగా గత పదిహేను సంవత్సరాలుగా ప్రయత్నాలు చేస్తున్నది. వాటివల్ల పునాది స్థాయి ఇన్నోవేటర్ల సృజనాత్మక శక్తి వెలుగులోకి రావటంతో పాటు, ఎంతోమందికి శారీరకంగా, ఆర్థికంగా, సమయ పరంగా ఎంతో లాభం చేకూరింది. ఈ ప్రయాణంలో పరిష్కారాలు వెతికిన అనుభవంతో సమాజంలో వున్న సమస్యలను కూడా వెతికి పల్లెసృజన కుటుంబంలో వున్న ఇన్నోవేటర్ల ద్వారా పరిష్కారాలు చేయిస్తే సమాజానికి ఇంకా లాభం చేకూరు తుందని భావించాం.

గ్రామాల్లో మీరెవరైనా వ్యక్తిగతంగా లేదా నలుగురికీ సంబంధించిన ఏదైనా సమస్యకు పరిష్కారం వుంటే బావుంటుంది అనుకుంటున్నారా? ఐతే అటువంటి సమస్యలను క్రింద ఇచ్చిన వాట్స్ యాప్ నంబర్లకి పంపగలరు. ఎన్ని సమస్యలైనా పంపవచ్చు. పరిష్కారాలను మా ఇన్నోవేటర్ల సహాయ సహకారాలతో వెతికే ప్రయత్నాలను, వాటి ప్రగతిని మీకు 'పల్లెసృజన' పత్రిక ద్వారా తెలియజేస్తూ వుంటాము. - ఎడిటర్

వాట్స్ యాప్ నంబర్లు : బ్రిగేడియర్ గణేశం, 9866001678, సుభాష్ చందర్, 9652801700

# 40వ చిన్నశోధయాత్ర - యాత్రీకుల అనుభూతి



ప్రేమ. నాకు, మొదటిసారి నాపైన నాకే ప్రేమ పుట్టింది. ఒకరి కొకరం పరిచయం లేకుండా నడుస్తున్న అనామకుల మీద కూడా ప్రేమ పెరిగింది. నాతోపాటు వున్న పరిచయం లేని వ్యక్తులకు నా గురించి ఏమీ తెలియదు. అందరికీ తెలిసింది కేవలం ప్రేమను పంచడమే. ఎవరన్నారు ప్రేమ అకస్మాత్తుగా ఒకేసారి పుడుతుందని? నాకు ఈ మూడు రోజుల్లో అనేక సార్లు అనేక సందర్భాల్లో మా మాటల్లో  ప్రేమ అంటే ఏమిటో తెలిసింది. బహుశా మీరు ఇలా ప్రేమ పుట్టడానికి ఏం జరిగింది అని ఆలోచిస్తూ ఉంటారు. బాబూ నాకే అర్థం కానిది మీకేం చెబుతాను? మీతో కలిసి పంచుకొన్న మధుర క్షణాలు, అనుభవాలు తలుచుకుంటూ ఉంటే నా ముఖంమీద ఒక చిరునవ్వు, మనసులో ఆనందం కలిగింది. గుండ్రంగా కూర్చొని, ఒకళ్ళ అనుభవాలు ఒకళ్ళము చెప్పుకుంటూ ఉంటే మొదట అర్థంలేని పని అనిపించినా, తర్వాత ఒకే విషయంపై ఇన్ని భావాలు, ఇన్ని స్పందనలు ఉంటాయా అనిపించింది. ఎన్నో కోణాలు తెలిశాయి. ఎప్పటికీ అంతం కాని మార్గంలో నడుస్తూ వెళుతూ వుంటే, ఇంకా ఎంత దూరం ఇక చాలు బాబోయ్ అని అరవాలి అనిపించింది. ఒక బలహీన క్షణంలో నా కాళ్ళు మారాం చేసి, ఇక ముందుకి కదలము అని భీష్మించాయి. నా కోమలమైన తెల్లని శరీరం నల్లని మచ్చలతో నిండిపోయింది. శరీరానికి, మనసుకీ మధ్య అంతర్యుద్ధం జరుగుతోంది. పడుతున్న కష్టాలన్నీ మర్చిపోయి, సుఖమైన జీవితం కావాలా? లేదా వెలకట్టలేని అనుభవసారం కావాలా? చాలా సార్లు నాలో నేను పడే సంఘర్షణలో శరీరం ఇంక చాలు, ముందుకు వెళ్ళలేను అంటుంది. కానీ మనసు మాత్రం ఇంకా కావాలంటుంది. పక్కలకీ, వెనక్కీ తిరిగి తోటివారిని చూస్తూ ఉంటే ముందు పరిచయం లేనివారు కూడా ఎంతో పరిచయమున్నట్లు, అమ్మల్లా కనిపించి, నాలాంటి అనుభవాలే వారూ పొందుతున్నారు అనిపించింది. మారాం చేసిన కాళ్ళను బుజ్జగిస్తూ, మరేం ఫరవాలేదు నీలాగనే ఈ గుంపులో చాలా మంది ప్రకృతిని ప్రేమించే వెర్రివాళ్ళున్నారు. వాళ్ళతో పాటూ మనమూ .... పద ముందుకి అంటూ సాగాను. చిన్నవాళ్ళు, పెద్దవాళ్ళు, నల్లజుట్టు వాళ్ళు, తెల్ల జుట్టువాళ్ళు, తెల్లజుట్టుకి నల్ల రంగు వేసుకున్న వాళ్ళు, పండిన అనుభవం కలవాళ్ళు రంగులతో, వయసుతో పని లేకుండా గుంపులోని అందరూ యవ్వనపు రంగు పులుముకొని ఉత్సాహాన్ని గుండెల్లో నింపుకోవటమే కాక, ఇతరులకీ, ప్రక్కవాళ్ళకీ, ప్రపంచానికి ప్రేమను పంచడం నేర్చుకున్నాం. చాలామంది అడగొచ్చు. ఈ మూడు రోజుల్లో ఏమి సాధించారు? అని. అలాంటి వాళ్ళకు ఏం చెప్పను....! స్వయంగా అనుభవిస్తే కాని చెప్పలేనిది సాధించాం !! నాకు మాత్రం నామీద, ప్రపంచం మీద, ప్రకృతి మీద ఎనలేని ప్రేమ పుట్టుకొని వచ్చింది.

-ఒక 'శోధయాత్రి'



. 'పల్లెసజన' వారి ఈ 40వ "చిన్న శోధయాత్ర"లో నన్ను అబ్బుర పరచినవి 72 ఏళ్ళ గణేశం గారు, 74 సం.ల మాధవ రెడ్డి గారు. వారి శక్తి, ఓపిక, పట్టుదల నన్ను మంత్రముగ్ధున్ని చేశాయి. సాధారణంగా ఈ తరం యువత ఇంటర్నెట్‌తోను, గూగుల్‌తోను కాలక్షేపం చేస్తూ..... అదే ప్రపంచం అని బ్రతుకుతూ ఉంటారు అన్న అపవాదుని కాదని నిరూపిస్తూ యాత్రలో పాల్గొన్న యువతీ యువకులు హృదయపూర్వకంగా సమాజ సేవ చేయటానికి చూపిన ఉత్సాహం చూసి తీరాల్సిందే. మూడు రోజుల ఈ యాత్ర, యాత్రీకులకి గ్రామీణ జీవితం రుచి చూపించి తెలియని అనేక విషయాలు తెలుసుకునే అవకాశం కల్పించింది. స్థితిమంతులు, ధనవంతులు కాకపోయినా తమకున్న కొద్ది వనరులతో ఎంత ఆనందమయమైన, నిజాయితీగల జీవితం గడుపుతున్నారో అన్నది తెలిసింది. మొత్తానికి ఏ తరగతి గదిలోనూ  తెలుసుకోలేని అనేక

విషయాలు, అనుభవాలు తెలుసుకునేలా చేసిందీ యాత్ర. **-అనిల్ కుమార్**

నేను 2014 నుండి వాలంటీరుగా లేదా ఇతరత్రా 'పల్లెసృజన' కార్యక్రమాలలో పాలు పంచుకుంటూనే ఉన్నాను. 2020 నుండి నేను స్వంతంగా రెండు చిన్న స్టార్టప్ కంపెనీలు ప్రారంభించి, వాటిమీద దృష్టి కేంద్రీకరించడంతో 'పల్లెసృజన' కార్యక్రమాలకు కొంచెం దూరం అయ్యాను అన్పించింది. అయ్యో పల్లెసృజన కార్యక్రమాలలో పాల్గొనటం లేదే అన్న భావన చివుక్కుమనిపిస్తూనే ఉంది. అటువంటి ఒక క్షణంలో ఈ శోధయాత్రలో తప్పనిసరిగా పాల్గొనాలి అని నిర్ణయించుకున్నా. దీనితో పల్లెసృజన కార్యక్రమాల్లో పాల్గొనవచ్చు, కొత్త విషయాలు తెలుసుకోవచ్చు అన్న ఆలోచన. నిజానికి ప్రతి యాత్రా ఒక నూతన అనుభవం. బ్రిగేడియర్ గారు చెప్పినట్లు నేర్చుకోవాలి అన్న తపన ఉన్నవాళ్ళకి ఎంతైనా నేర్చుకునే అవకాశం కల్పిస్తాయి ఈ శోధయాత్రలు. పాతవాళ్ళ మాట అటుంచి, శోధయాత్రలో కొత్తగా పాల్గొనే వాళ్ళని చూస్తూ వుంటే వీళ్ళకెంత మంచి అవకాశం కదా అనిపిస్తుంది. ఇతరుల మనోభావాలను విస్పష్టంగా అర్థం చేసుకోవటానికి నేను తక్కువ మంది వ్యక్తులతో తక్కువ మాట్లాడి, ఎక్కువ వినటం అలవాటు చేసుకున్నా. కానీ ఈసారెందుకో చాలా మందితో చాలాసేపు మాట్లాడాను అనిపించింది. బహుశా ఉన్న వ్యక్తులు అలాంటి వాళ్ళేమో. ఇంతకు ముందు ఎక్కువ చలిలో నడిచిన సందర్భాలు ఉన్నాయి కానీ, ఈసారి ఎండలో ఎక్కువ నడవాల్సొచ్చింది. నా బూటు అడుగు చెడిపోయినా, తొణకకుండా యాత్ర పూర్తి చేశాను. మొదటి రోజు ఏవిధమైన ప్రాసెసింగ్ చెయ్యకుండా నల్లేరుని యథాతథం రుచి చూశాను. ఆ మంటతో చాలాసేపు బాధపడ్డాను. వెంకట్, మహేష్ ప్రక్కనుండి తమ చలోక్తులతో నాకు ఉపశమనం కలిగించారు. సాయంత్రానికి బాధ చాలావరకు తగ్గింది. ఈసారి గుర్తుండిపోయే అనుభవాల్లో అదొకటి.

ఈ యాత్రలో స్థానికంగా దొరికే ఆహార పదార్థాలపై ఎక్కువ దృష్టి పెట్టాను. గ్రామాలలో కనిపించిన స్త్రీ పురుషులని వాళ్ళు ఏం తింటారు, ఆ పదార్థాలని ఎలా తయారు చేస్తారు అని అడిగి తెలుసుకున్నాను. వారు ఆ వండే విధానాన్ని చెపుతూ వుంటేనే నా నోరూరింది.

బడిలో రాత్రి నిద్రపోయి, రెండోరోజు నిద్ర లేచి బోరింగు పంపు వద్ద స్నానం చేశాం. వాతావరణం కొద్దిగా చల్లగా వున్నా భూమిలో






నుంచి వచ్చిన నీరు వెచ్చగా ఉండటంతో సరిపోయింది. ఈ విధంగా స్నానం చెయ్యటం ఎప్పుడూ కొత్తగానే ఉంటుంది. మంచి అనుభవం. తరువాత రుచికరమైన దోశలు తిన్నాం. మన పట్టణాలలో దొరికే పలుచని పెద్ద దోశల్లాగా కాక, ఇవి మందంగా, చిన్నగా ఉన్నాయి. భలే రుచిగా ఉన్నాయి. తరువాత బోండాలు తిన్నాం. అవీ మన పట్టణాలలో మైదా పిండితో చేసిన లాంటివి కాక, దోశ పిండితో చేసినవి. చట్నీ, సాంబారుతో మహా రుచికరంగా ఉన్నాయి. మేము టిఫిన్ పూర్తి చేయగానే అప్పటికే కొందరు పిల్లలు (త్వరగా బడికి వచ్చే రకం) వచ్చేశారు. పాఠశాల మొదలవడానికి ఇంకా సమయం ఉండటంతో వారితో కబడ్డీ ఆడాము. వారంతా చిన్న పిల్లలు అవటం వల్లనేమో చాలా చురుకుగా, ఉత్సాహంగా ఆడారు. మేము వారి వెనక పరిగెత్తలేక అలసిపోయాము. అక్కడే నా బూటు అడుగు ఊడిపోయింది. యాత్ర పూర్తయేంత వరకు అలాగే లాగించేశాను (ఇదొక అనుభవం).

ఇటువంటి శోధయాత్రలలో అఖిల చాలా ఉత్సాహంగా పిల్లల చేత ఇగ్నైట్ ఆలోచనల కార్యశాల నిర్వహిస్తుంది. ఇది నిర్వహించడంలో ఆమెకి ఎవరూ సాటిరారు. ఈసారి నేనూ ఈ ప్రక్రియలో పాల్గొన్నాను. చాలా రోజుల తర్వాత చేశానేమో పిల్లలతో మాట్లడటం చాలా సంతృప్తిని ఇచ్చింది.

ఈసారి శోధయాత్రలో మేము తిరిగిన ఊళ్ళలో పుష్కల మైన నీరు ఉండటంతో వరి పండిస్తున్నారు. కూరగాయలు, ఇతర వస్తువులు బయటి నుండి తెప్పించుకుంటారు. మీకు కావలసిన కూరగాయలు మీరే ఎందుకు పండించుకోరు అని అడిగితే, చాలాసార్లు ప్రయత్నం చేశాము కాని, కోతులు పంటలను నాశనం చేస్తున్నాయని చెప్పారు. ఈ సమస్యకి ఏమైనా పరిష్కారం ఉందా? గ్రామాలలోని రైతులు వ్యక్తిగతంగా కాని, గుంపుగా కానీ కాయగూరలు పండించి, స్థానికంగా వాడుకున్న తర్వాత దగ్గరలోని మార్కెట్‌కి తరలించి, లాభపడే మార్గాలకై అన్వేషణ చెయ్యాలి. ఈ విషయంలో యువతకి ఏమైనా ఆలోచనలు వస్తే పంచుకుంటే మంచిది.

నీళ్ళల్లో ఆడుకోవడం ఎప్పుడూ ఆనందదాయకమే. అదీ గుంపుగా చేస్తే మరీ బావుంటుంది. మూడవ రోజు ఉదయం పెన్నా నదిలో స్నానం చేశాము. పట్టణాలలో కాళ్ళచుట్టూ చేపలు చేరి పాదాలలో చెడిపోయిన కణాలని, కాళ్ళు పగిలి పైకి లేచిన చర్మాన్ని తినటానికి చాలా డబ్బు ఖర్చు చేయాల్సి వస్తుంది. కానీ, మన పెన్నా నదిలో ఈ సదుపాయం ఉచితంగా కలిగింది.

పొలాల గట్లవెంట నడవటం, వరి పొలంలో పాల కంకులను రుచి చూడటం, పచ్చి గాలి పీల్చటం ఇలాంటి మరపురాని అనుభవాలు ఎన్నో శోధయాత్రలో తారసపడతాయి. ఈవన్నీ ఎన్ని కోట్లు ఖర్చు పెట్టినా సాధ్యం కానివి. ప్రతి యువతీ యువకుడు ఒక్కసారైనా శోధయాత్రలో పాల్గొంటే వారి అనుభవాలకు పరిపూర్ణత ఏర్పడుతుంది. **-ఓంకార్‌నాథ్**




# గ్రామీణ ఇన్నోవేటర్లు - ప్రభుత్వ వ్యవస్థ మధ్య వంతెనగా 'పల్లెసృజన' వాలంటీర్లు

ప్రస్తుతం ప్రభుత్వాలు గ్రామీణుల కోసం ఎన్నో పథకాలను అందజేస్తున్నారు. ఆ పథకానికి సంబంధించిన దరఖాస్తులను కోరుతూ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేస్తారు. కానీ, అందుకు దరఖాస్తు ఎలా చేసుకోవాలో గ్రామీయులకు తెలియదు. ఈ విషయం గురించి తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'టిఎస్ఐసి' (తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్) చర్చల్లో భాగంగా పల్లెసృజన తెలియజేసిన అభిప్రాయం వల్ల ప్రభుత్వం మొట్టమొదటి సారి దరఖాస్తు ఫారాన్ని తెలుగులో కూడా ఏర్పాటు చేసింది. అయినా వారు అడిగిన ప్రశ్నలకు జవాబు ఎలా రాయాలో కూడా వారికి తెలియదు. అందుకే ఒక్కో ఇన్నోవేటర్‌కు ఒక వాలంటీర్‌ను ఏర్పాటు చేసింది పల్లెసృజన. వాలంటీరు, ఇన్నోవేటర్ ఇద్దరు కలిసి ఆ ఫారాన్ని నింపుతారు. వాలంటీరు అక్కడ వున్న ప్రశ్నను ఇన్నోవేటర్‌కు విపులంగా తెలియజేసి, ఇన్నోవేటర్‌కు ఏది అవసరమో తెలుసుకుని, దాన్నే ఫారంలో నింపి, ఎంపిక కొరకు పంపుతాడు వాలంటీరు. అంటే ఇన్నోవేటర్‌కు, ప్రభుత్వానికి మధ్యన వున్న గ్యాప్‌ను వాలంటీరు పూర్తి చేయ గలిగాడు. ఈ పద్ధతిని సంసాస్థగతం చెయ్యాలి అంటారు పల్లెసృజన వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం.

ఇంతవరకు ప్రభుత్వాలు తల బద్దలు కొట్టుకుంటున్న సమస్య ఏమిటంటే, మేము ఎన్నో పథకాలను గ్రామీణుల కోసం ప్రకటిస్తున్నాము, అయినా అవి అనుకున్న, ఆశించిన మేరకు గ్రామాలకు చేరటం లేదు, లోపం ఎక్కడ ఉంది అని. ఈ సమస్యను పల్లెసృజన వాలంటీరు తీర్చటమే కాదు, ప్రభుత్వం అందించిన గ్రాంటు ఏవిధంగా ఉప యోగ పడుతుంది, ఇన్నోవేషన్ తయారీ ఎంత వరకు వచ్చింది, అది పూర్తయిన తర్వాత దాని ఉపయోగం వినియోగ దారుడి సమస్యను ఎలా తీర్చిం ది లాంటి అన్ని రిపోర్టులను వాలంటీరే ప్రభుత్వానికి తెలియ జేయటం జరుగు తోంది. అంటే వాలంటీరు ప్రభుత్వం ప్రకటించిన పథకం కొరకు దరఖాస్తు చేయ టం, వారు అందించిన గ్రాంటు ద్వారా ఇన్నోవేషన్ పూర్తి వివరాల ను ఎప్పటికప్పుడు అందజేయటం, గ్రామీణుల సమస్య లను పరిష్కరించిన విధానం లాంటి వన్నీ ఒక నివేదిక ద్వారా తెలియ జేస్తున్నాడు. ఈవిధంగా ప్రభుత్వ పథకాలు సులభంగా, సమర్థవంతంగా గ్రామాలకు చేరవేయటం అనే గొప్ప కార్యాన్ని నెరవేర్చ గలిగింది 'పల్లెసృజన'. ఇంత పెద్ద వ్యవస్థీకృత పరిష్కారం లభించినపుడే పథకాలు నిజమైన లబ్దిదారులకు లాభం చేకూరుతుంది.

టిఎస్ఐసి వారు ఎన్నిక చేయబడ్డ ఇన్నోవేటర్లకు గ్రాంటును మొదట 30 శాతం, మధ్యలో మరి కొంత, ఇన్నోవేషన్ పూర్తయిన తర్వాత పూర్తిగా ఇస్తామన్నారు. అందుకు పల్లెసృజన ఒప్పుకోలేదు. మీకు ఇష్టం లేకుంటే గ్రాంటు శాంక్షన్ చేయకండి, అంతేకానీ, ఇలా ముక్కలు ముక్కలుగా ఇవ్వటం వల్ల సమస్య పరిష్కారం కాదు, డబ్బు కూడా వృధా అవుతుంది. కాబట్టి మొదట 90 శాతం ఇన్నోవేటర్‌కు ఇవ్వండి, ఇన్నోవేషన్‌ను నిర్ణీత సమయంలో పూర్తి చేసిన తర్వాత మిగతా 10 శాతం ఇవ్వండి అని వాదించడం జరిగింది. ప్రభుత్వ అధికారులు మీరు చెప్పిన విధానం సరియైనది కాబట్టి మొదట 75 శాతం ఇస్తాము. ఇన్నోవేషన్ పూర్తయి, ప్రయోగాత్మకంగా నిరూపించ బడిన తర్వాత మిగతా 25 శాతం ఇస్తామని తెలియ జేస్తూ, కొంతమంది ఇన్నోవేటర్లకు గ్రాంటును అందజే యటం జరిగింది.

ఈవిధంగా సమస్య పరిష్కారం కావటం వల్ల అటు ఇన్నోవేటర్లు, ఇటు ప్రభుత్వం ఆనందంతో పాటు, తయారైన ఇన్నోవేషన్‌ను ఉపయోగించు కుంటున్న వినియోగ దారులు కూడా తమ సంతోషాన్ని వ్యక్తం చేయటం జరిగింది. 'పల్లెసృజన' ఇన్నోవేటర్లు పొంది న గ్రాంటు, వారి ఇన్నోవేషన్, ఇన్నోవేటర్ల వివరాలు ఈవిధంగా ఉన్నాయి.

**1. ఉదయ భాస్కర్, హైదరాబాద్:**



ధాన్యాన్ని తోడే మోటార్ తయారు చేసే ఇన్నోవేషన్ ఆలోచనకు వీరికి టిఎస్ఐసి 2 లక్షల రూపాయల గ్రాంటును ఇచ్చేందుకు అంగీకరించింది. ముందస్తు గా 1.5 లక్షల రూపాయలు విడుదల చేయటం జరిగింది. ఇన్నోవేషన్ తయారీ దాదాపు పూర్తి కావచ్చింది. ఇది పూర్తయిన తర్వాత మిగతా 50 వేల రూపాయలను ప్రభుత్వం విడుదల చేస్తుంది.

**2. అబ్బోజు వెంకటేష్, పర్కాల, హన్మకొండ జిల్లా:**




తక్కువ వెడల్పులో గల పంటలతో పాటు, ప్రత్తి, మిరప లాంటి పంటలలో కూడా అంతర సేద్యాలు చేసుకుందుకు అనువైన ఒకే చక్రం కలిగిన వీడర్ తయారు చేసినందుకు ఇతనికి టిఎస్ఐసి 2 లక్షల రూపాయల గ్రాంటును ఇచ్చేందుకు అంగీకరించింది. ముందస్తు గా 1.5 లక్షల రూపాయలు విడుదల చేయటం జరిగింది. ఇన్నోవేషన్ తయారీ పూర్తయింది. మిగతా 50 వేల రూపాయలను ప్రభుత్వం త్వరలో విడుదల చేస్తుంది.

**3. గొర్రె అశోక్, సూర్యాపేట జిల్లా:**



అశోక్ ప్రతిపాదించిన పైలట్ మోడల్ వరి లో స్ప్రే చేసే యంత్రం తయారీకి ఒప్పుకోవడం జరిగింది. ఈ యంత్రంపై రైతు కూర్చొని 200 లీటర్ల మందు ద్రావణాన్ని స్ప్రే చేయవచ్చు. ఇతనికి టిఎస్ఐసి 2 లక్షల రూపాయల గ్రాంటును ఇచ్చేందుకు అంగీకరించింది. ముందస్తు గా 1.5 లక్షల రూపాయలు విడుదల చేయటం జరిగింది. ఇన్నోవేషన్ తయారీ దాదాపు పూర్తి కావచ్చింది. పొలాల్లో రైతులు దీన్ని వాడి చూస్తారు. ఆ తర్వాత డిజైను ఫైనల్ అవుతుంది. ఇది పూర్తయిన తర్వాత మిగతా 50 వేల రూపాయలను ప్రభుత్వం విడుదల చేస్తుంది.

**4. మోధా శివ కుమార్, హైదరాబాద్:**

శివకుమార్ చేనేత కార్మికుల కష్టాన్ని రూపొందించేందుకు తయారు చేసిన మగ్గానికి పెడల్ ఆపరేషన్ కష్టం లేకుండా దాన్ని ఎలక్ట్రానిక్ పద్ధతిలో తయారు చేసి, నేత కార్మికుల మోకాళ్ళ నొప్పులు



రాకుండా చేయటంతో పాటు, అధిక ఉత్పత్తి చేసేలా తయారు చేసిన 'మోధా పెడల్ ఆపరేటింగ్' యంత్రాలను రెండు రకాల మగ్గాలకు అనువైన రెండు ఇన్నోవేషన్లను తయారు చేసినందుకు టిఎస్ఐసి 2 లక్షల రూపాయల గ్రాంటును ఇచ్చేందుకు అంగీకరించింది. ముందస్తు గా 1.5 లక్షల రూపాయలు విడుదల చేయటం జరిగింది. ఇన్నోవేషన్ తయారీ పూర్తి అయింది. మార్కెట్లోకి వచ్చింది. ఎంతోమంది చేనేత కార్మికుల మన్ననలు కూడా అందుకుంది. మిగతా 50 వేల రూపాయలను ప్రభుత్వం త్వరలో విడుదల చేస్తుంది.

**5. అంజయ్య, నిజామాబాద్ జిల్లా.**



సామాన్య రైతు కూడా కొనుగోలు చేసేంత తక్కువ ధరలో, పెట్రోల్, డీజిల్ లాంటి ఇంధనం అవసరం లేకుండా కేవలం రీఛార్జింగ్ ద్వారా పని చేసేలా తయారు చేసిన వీడర్ గ్రాంట్‌కు ఎంపిక కావటం జరిగింది. అంతర సేద్యాలతో పాటు, ధాన్యం ఆరబెట్టడం కోసం ధాన్యాన్ని నెరిపేందుకు కూడా ఉపయోగపడే ఈ వీడర్ రూపొందించేందుకు వీరికి టిఎస్ఐసి 2 లక్షల రూపాయల గ్రాంటును ఇచ్చేందుకు అంగీకరించింది. ముందస్తు గా 1.5 లక్షల రూపాయలు విడుదల చేయటం జరిగింది. ఇన్నోవేషన్ తయారీ పూర్తి అయింది. మిగతా 50 వేల రూపాయలను ప్రభుత్వం త్వరలో విడుదల చేస్తుంది.

పునాది స్థాయి ఇన్నోవేషన్లు అయితేనే రాష్ట్ర రైతాంగానికి తక్కువ ధరలో అవసరమైన పనులను చేయగలవు, విదేశీ పరిజ్ఞానం కన్నా, స్థానిక పరిజ్ఞానం అయితే ఎవరి యంత్రాలను వారే మరమ్మత్తు చేసుకుని, ఇతరులపై ఆధారపడకుండా తమ పొలం పనులను చేసుకోవచ్చు. 'పల్లెసృజన' ఈ నమ్మకంతో పని చేస్తున్న ఉద్దేశ్యానికి ఊతమిచ్చి పునాది స్థాయి ఇన్నోవేషన్లను అందరికీ అందించాలి అని ఇన్నోవేటర్లకు గ్రాంటులను ఇచ్చి ఉత్తేజితులను చేసిన కేంద్ర మరియు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు, అభినందనలు తెలియజేస్తున్నాము. ఈ పద్ధతిని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరించ గలిగితే మన దేశంలో దేశీ పరిజ్ఞానం విరాజిల్లటంతో పాటు, అధిక బరువుతో భూమికి భారంగా మారుతున్న పెద్ద పెద్ద యంత్రాలను కొంత వరకైనా నియంత్రించి పొలాలను పర్యావరణ కాలుష్యం నుండి కాపాడతారని ఆశిద్దాం.

# 'పునాది స్థాయి ఇన్నోవేషన్ల'తో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి



- జమ్మలమడక శశిమోహన్

గ్రామల్లో యువతీ యువకులు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఇతర కారణాల రీత్యా ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే మన దేశంలో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి చదువులకు వెళ్తున్న యువత కేవలం 23 శాతం. అంటే 73 శాతం యువత ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ఎంతోమంది ఉపాధి కోసం ఎదురు చూపులు చూస్తున్న సంగతి అందరికీ విదితమే. తమ చదువుకు తగిన ఉపాధి లభించటం లేదని కొందరు, ఏదైనా ఉద్యోగం సాధిద్దామంటే తగినంత చదువు చదవలేక పోయామే అని కొందరు, ఏదైనా వ్యాపారం చేసుకుందామంటే బ్యాంకులు ఎలాంటి తనఖా లేకుండా తమకు రుణం ఇవ్వటం లేదని కొందరు..... ఇలా ఎన్నో రకాలుగా ఆలోచిస్తూ, ఏమి చెయ్యాలో తెలీక నిస్సహాయంగా గ్రామ యువత కాలం గడుపుతున్నారు.

ఇలాంటి యువత కొరకు తమ గ్రామంలోనే వుండి, తాము తల్లిదండ్రులపైన ఆధార పడకుండా తమ ఖర్చులకు అవసరమైన ధనాన్ని తామే సంపాదించుకోవటంతో పాటు తామే కుటుంబానికి కాస్త చేదోడుగా తయారవుతూ, తమను తిట్టిన నోళ్ళే పొగిడేలా తయారు కావడానికి అవసరమైన ఎన్నో పునాది స్థాయి ఇన్నోవేషన్లను 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చింది. ఏ పని చేస్తున్నామన్నది ముఖ్యం కాదు, తాము చేస్తున్న పని ఎంత మందికి ఉపయోగ పడుతున్నది, దానివల్ల తాము ఎంత సంపాదిస్తున్నాము, గతంకన్నా ఇప్పుడు మనపైన ఎంత గౌరవం పెరిగింది అన్నది ఆలోచిస్తే చాలు మీ భవిష్యత్తును మీరే తీర్చి దిద్దుకున్నవారు అవుతారు. ఈ పరంపరలో 2021 జులై–ఆగస్టు సంచిక నుండి యువత ఉపాధి కొరకు వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లను గురించి తెలియచేస్తోంది 'పల్లెసృజన'.

– ఎడిటర్.

## వ్యవసాయ వ్యర్థాలతో కంపోస్ట్ ఎరువు తయారీ ఉపాధితో పాటు ఊరికి సేవ

రైతులు తమ పొలాల్లో పంటల నూర్పిడి అయిపోగానే పొలంలోని వ్యవసాయ వ్యర్థాలైన జొన్న, కొర్ర, వరి, ప్రత్తి, పొగాకు, మిరప, చెఱుకు, కంది ఇంకా ఎన్నో రకాల పంటల కొయ్యలు అంటే పంట కోసిన తర్వాత భూమి లోపల, పైన వున్న కొయ్యలను సేద్యం చేసి, వాటిని ఏరి అక్కడక్కడ కుప్పలుగా పోసి వాటికి నిప్పు పెట్టి తగల బెడుతూ ఉంటారు. దీనివల్ల ప్రత్యక్షంగా జరిగే నష్టాలు రెండు. మొదటిది వాతావరణ కాలుష్యం, రెండోది ఆ తగలబెట్టినచోట భూమి తన సారాన్ని కోల్పోవటం. పరోక్షంగా జరిగే నష్టం పేనుకు ఎరువుగా మారాల్సిన వ్యర్థాలు తగలబడి పోవటం. ఇలా తగలబెట్టడం వల్ల వచ్చే బూడిద ఎరువు అవుతుంది అని కొందరు అమాయక రైతులు అనుకుంటూ వుంటారు. కానీ, ఆ బూడిద వల్ల రైతుకు జరిగే లాభం అతి కొద్ది శాతం మాత్రమే. అదే ఎరువుగా మార్చ బడితే రైతుకు, భూమికి ఎనలేని లాభం.

**వాతావరణ కాలుష్యం:**

వ్యవసాయ వ్యర్థాలను తగలబెట్టడం వల్ల వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇందుకు ఉదాహరణ పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో రైతులు పెద్ద మొత్తంలో పంట వ్యర్థాలను తగలబట్టడం వల్ల ఢిల్లీలో కాలుష్యం పెరిగి, ప్రపంచంలోనే ఎక్కువ కాలుష్యం కలిగిన పట్టణాలలో ఒకటిగా నిలిచింది. అంతే కాక,







విమానాల రాకపోకలకు ఆటంకం కలిగించే స్థాయిలో కాలుష్యం పెరిగింది.

రైతులు ఈ పని ఎందుకు చేస్తున్నారు? అంటే వ్యవసాయ వ్యర్థాలను పొలంలో కలియదున్నితే అవి మురిగి ఎరువుగా మారటానికి రెండు మూడు సంవత్సరాలు పడుతుంది అన్న విషయం ఒకటైతే, పొలం మొత్తం కొయ్యలతో నిండిపోయి, పొలంలో నడవటానికి ఇబ్బంది అవుతుంది అన్న విషయం మరొకటి. అందుకే కష్టమైనా, నష్టమైనా సరే వాటిని కూలీలచే ఏరించి తగలబెడ్తారు. కూలీలను భరించలేని రైతులు మొత్తం పొలం మీదనే వాటిని తగలబెట్టి ఆ తర్వాత పొలాన్ని దున్ని వేస్తారు.

అందువల్ల ప్రతి గ్రామంలో కొంతమంది యువకులు సమూహంగా ఏర్పడి, రైతులకు పంట వ్యర్థాలు తగలబెట్టడం వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించాలి. వారు వాటిని తగలబెట్టకుండా కుప్పలుగా చేస్తే చాలు మేము వాటిని తీసుకు వెళ్తాం అని వారిని ఒప్పించి ఆ వ్యర్థాలను మీరు సేకరించి ఎరువుగా మార్చవచ్చు. ఉచితంగా ఇవ్వటం ఇష్టం లేని రైతులకు మీరు మీ పంట వ్యర్థాలను మాకు ఇస్తే ఎరువుగా తయారైన తర్వాత మీకు కొంత ఎరువును ఇస్తామని చెప్పటం ద్వారా వాటిని సేకరించవచ్చు. ఈ వ్యర్థాలను ఒక చోటికి చేర్చుకోవటానికి కిరాయి ట్రాక్టర్లు అవసరం అవుతాయి. ఈ ఎరువు తయారీని పెద్దయెత్తున చేయాలి అనుకున్న సామర్థ్యం వున్న యువకులు ఈ సంచికలోనే 18వ పేజిలో "వ్యవసాయ వ్యర్థాలను ఎరువుగా మార్చే యంత్రం" గురించిన సమాచారం ఇవ్వటం జరిగింది. ఆ వ్యాసాన్ని చదివి అవసరం అనుకుంటే ఆ యంత్రాన్ని కొనుగోలు చెయ్యవచ్చు.

**ఎరువు తయారు చేసే విధానం:**

ట్రాక్టర్ల ద్వారా వ్యవసాయ వ్యర్థాలను ఒకచోటకి చేర్చాలి. ఆ వ్యవసాయ వ్యర్థాలను వీలైనంత చిన్న చిన్న ముక్కలుగా చేసే యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. వాటి ద్వారా ఆ వ్యర్థాలను చిన్న ముక్కలుగా చేసుకోవాలి. ముక్కలు చెయ్యకుండా అలాగే కూడా వెయ్యవచ్చు. అయితే చిన్న ముక్కలుగా చెయ్యకుంటే అవి మురిగి ఎరువుగా మారటానికి కొద్దిగా ఎక్కువ సమయం తీసుకుంటుంది. ముందుగా నేలపై ఒక అడుగు మందంలో మట్టిని పొయ్యాలి. ఆ మట్టి పైన రెండు లేదా మూడు అడుగుల మందంలో వ్యవసాయ వ్యర్థాలు వేసి బాగా నీటితో తడపాలి. ఆ తర్వాత ఆ వ్యర్థాలపై పేడ ఎరువు ఒక అడుగు మందంలో వెయ్యాలి. ఇలా మట్టి, వ్యవసాయ వ్యర్థాలు, ఎరువు పొరలు పొరలుగా వేస్తూ ప్రతి పొరపైన నీటిని చిలకరిస్తూ ఉండాలి. ఇలా తయారు చేసిన మట్టి దిబ్బ ఒక నెల రోజుల్లో బాగా కుళ్ళి, కంపోస్టు ఎరువుగా తయారవుతుంది. నెల రోజుల తర్వాత ఆ దిబ్బను పార లేదా ఎక్కువ మోతాదులో వున్న వారయితే జెసిబి, లేదా ట్రాక్టరు లోడర్‌తో బాగా కలియతిప్పాలి. కలియ తిప్పుతూ నీటిని చిలకరిస్తూ ఉండటం మరవకూడదు. ఆలా కలియ తిప్పిన ఎరువును మరో పది, పదిహేను రోజులు అలాగే ఉంచినట్లయితే అది ఇంకా బాగా కుళ్ళిపోయి, మంచి పోషకాలు కల కంపోస్టు ఎరువుగా తయారవుతుంది. ఇలా కలియతిప్పేటప్పుడు మరియు మొదట పొరలు పొరలుగా వేసి నీళ్ళు చిలకరించేటప్పుడు "వేస్ట్ డీకంపోజర్" ను కూడా నీటిలో కలిపి చిలరకరిస్తే ఇంకా మంచి ఎరువు అవుతుంది. ఈ డీ కంపోజర్ మార్కెట్‌లో లభిస్తుంది, లేదా మీరే స్వయంగా కూడా తయారు చేసుకోవచ్చు. గూగుల్ లేదా యూ ట్యూబ్ వీడియోల్లో డీ కంపోజర్ ఎలా తయారు చేయాలో వివరంగా ఉంది.

ఇలా తయారు చేసిన కంపోస్ట్ ఎరువును రైతులకు అందించినట్లయితే, మీరు మంచి లాభాలను పొందవచ్చు. ఈవిధంగా చేయుటం వల్ల మీరు రైతులను రసాయన ఎరువుల నుండి సేంద్రియ ఎరువుల వైపుకు మళ్ళించడంతో పాటు, మీ గ్రామంలో ఎటువంటి చెత్త చెదారం లేకుండా చేయుటం, వ్యవసాయ వ్యర్థాలను ఏ రైతూ కాల్చి వేయకుండా, పర్యావరణాన్ని రక్షించిన వారవుతారు.

ఈ ఎరువు బెడ్లను తయారు చేయటం ఒక్కసారే అనుకోవద్దు. మీకు వీలైనన్ని బెడ్లు ఇలా తయారు చేసుకుంటూ వెళ్తే చాలు ఎల్లప్పుడూ రైతుకు అవసరమైన ఎరువు స్టాకు మీవద్ద ఉన్నట్లే. పూర్వం రైతులు కేవలం వర్షాకాలం పంటలు మాత్రమే వేస్తూ ఉండేవారు కాబట్టి సంవత్సరానికి ఒక్కసారే ఎరువుల వ్యాపారం ఉండేది. కానీ, ప్రస్తుత ఆధునిక వ్యవసాయంలో ఎప్పుడూ ఏదో ఒక పంట వేస్తూనే ఉన్నారు. అలాగే ఎప్పుడూ రసాయన ఎరువులను కొని తెస్తూనే ఉన్నారు. మీరు తయారు చేసిన ఎరువులను వీలైతే మీ సమీప వ్యవసాయ రీసర్చ్ కేంద్రాలు లేదా వ్యవసాయ అధికారులను కలుసుకుని వాటికి పరీక్షలు





చేయించి, మీ ఎరువులు ఏయే పోషకాలు, ఎంతెంత శాతం ఉన్నాయో కూడా తెలుసుకుని, రైతులకు వివరించాలి. మీవద్ద ఉన్న ఎరువులోని పోషకాలు ఏ రసాయన మందుకు సమానమో తెలియజేయాలి. రసాయన ఎరువుకు, మీరు అందిస్తున్న సేంద్రియ ఎరువుకు ధరలో వ్యత్యాసాన్ని తెలియజేయాలి. అలాగే సేంద్రియ ఎరువులను ఉపయోగించటం వల్ల భూమి బాగా గుల్లబారి, పంటలు ఆరోగ్యంగా పెరగటంతో పాటు, భూమిలో రైతుకు అవసరమైన మిత్ర పురుగులు, ఎరలు బాగా అభివృద్ధి చెంది, పంటలకు ఎంతో మేలు కలుగజేస్తాయి అని తెలియజేయాలి. ఈవిధంగా పండించిన పంటలు మనిషికి ఎంత ఆరోగ్యాన్ని ఇస్తాయో కూడా తెలియజేయాలి. ఆరోగ్యకరమైన పంట అధిక దిగుబడి వచ్చే అవకాశాలను రైతుకు సమగ్రంగా వివరించాలి.

ఈ వ్యాపారం గ్రామాల్లో యువకులు ఏర్పాటు చేసుకున్నట్లయితే, మీ వ్యాపారం అభివృద్ధి చెందటంతో పాటు, మీ గ్రామాన్నే సేంద్రియ గ్రామంగా మార్చే బృహత్తర అవకాశం మీ చేతుల్లోనే ఉంది.





మీకు ఎటువంటి సలహాలు, సహాయ సహకారాలు అందించటానికి 'పల్లెసృజన' ఎప్పుడూ మీవెంటే ఉంటుంది. ఇలా చేయటం వల్ల మీ గ్రామంలోనే మీరు మంచి వ్యాపార వేత్తగా కావడమే కాక, సమాజానికి కూడా ఎంతో మేలు చేసిన వారవుతారు. ఎంతో మంది పర్యావరణ ప్రేమికులు చేతిలెత్తి మొక్కి చెబుతున్నా, అర్థం చేసుకోలేని రైతులు పర్యావరణానికి నష్టం చేయటంతో పాటు, తాము నష్టపోతున్నారు. ముందు మీరు మారండి, ఊరి రైతులను మీరే మార్చండి. సమాజం దానంతట అదే మారిపోతుంది.

దేశంలో కోట్లాది ఎకరాల్లో వృధాగా కాలిపోతున్న ఎన్నో కోట్ల టన్నుల వ్యవసాయ వ్యర్థాలను ఆర్గానిక్ ఎరువుగా తయారు చేస్తే లక్షలాది మంది యువకులు స్వయం ఉపాధి పొందవచ్చు. ఆరోగ్యకరమైన ఆర్గానిక్ ఆహార ఉత్పత్తులు తయారయ్యేందుకు దోహదం అయ్యే అవకాశాలున్నాయి. ఈవిధంగా తయారైన ఆహార ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది, పైగా ఎగుమతి చేసే అవకాశాలు కూడా చాలా బాగా ఉంటాయి. తద్వారా రైతులు ఆర్థికంగా బలోపేతం అవుతారు. రైతు ఆర్థికంగా బలోపేతం కావడం అంటే ఆర్థికంగా దేశం కూడా బలోపేతం అవటమే అని యువత గుర్తించాలి. అలాగే విదేశాల నుంచి దిగుమతి చేసుకునే రసాయనిక ఎరువులపై వెచ్చించే ధనాన్ని దేశం ఆదా చేసుకుని, ఆ ధనంతో వ్యవసాయ రంగానికి ఎన్నో మౌలిక సదుపాయాలు కల్పించవచ్చు. వ్యవసాయ వ్యర్థాలతో పారిశ్రామిక వేత్తలు 'ఇథనాల్' అనే ఇంధనం తయారు చేసి, వాహనాలకు పెట్రోల్ స్థానంలో ఈ ఇథనాల్‌ను ఉపయోగించవచ్చు. పెట్రో దిగుమతులను తగ్గించుకుంటే విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయవచ్చు.

ఈ పద్ధతిలో ఎంతో పోషక విలువలు కల ఎరువును తయారు చేస్తున్న ప్రకాశం జిల్లా కురిచేడుకు చెందిన **కమలాకర్ రావు (ఫోన్ నెం. 98481 78232)** గారిని సంప్రదించి, పంట వ్యర్థాలను చిన్న చిన్న ముక్కలు గా చేసే యంత్రాలు, కంపోస్టు ఎరువు తయారీలో మెళకువలను గురించిన వివరాలను తెలుసుకోగలరు. ●



విశేషాలు

# మే-జూన్ 2022 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు





20-21 ఏప్రిల్ 2022 న హైదరాబాద్ లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం లో జరిగిన "అగ్రిటెక్ సౌత్ 2022" ప్రదర్శనలో 30 మంది ఇన్నోవేటర్లు తమ ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఎంతోమంది రైతులు, వ్యవసాయ అధికారులు ఈ ఇన్నోవేషన్లను ఉత్సుకతతో గమనించారు.



18 జూన్, 2022న వికారాబాద్ లోని వ్యవసాయ పరిశోధనా స్థానంలో జరిగిన 'గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్ల విస్తృతి'పై జరిగిన రైతు సమావేశంలో 70 మందికి పైగా రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొనడం జరిగింది.







14 మే, 2022 నాడు మెదక్ జిల్లా భూపాల పల్లి గ్రామంలో రైతులు మరియు విద్యార్థులకు పునాది స్థాయి ఇన్నోవేషన్లపై జరిగిన అవగాహనా సదస్సు దృశ్యాలు.



10 జూన్, 2022 నాడు వికారాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ వారు కొడంగల్ మండలం, రేగడి మైల్వార్ గ్రామం లో ఏర్పాటు చేసిన 'సాగుకు సమాయత్త సమావేశం'లో రైతులకు పల్లెసృజన ఇన్నోవేషన్లపై అవగాహన కల్పిస్తున్న సుభాష్ చందర్, సమావేశంలో పాల్గొన్న రైతులు, వ్యవసాయ అధికారులు.





2022 జూన్ 6 నుండి 9 వ తేది వరకు 'పల్లెసృజన' కార్యాలయంలో జరిగిన మహిళా ఎంటర్ ప్రెన్యూర్ కార్యక్రమంలో మహారాష్ట్ర నుండి 200 మంది, ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం జిల్లా నుండి 40 మంది మహిళలు పాల్గొని పల్లెసృజన ఇన్నోవేషన్లను పరిశీలించి, వాటి వ్యాపార దృక్పథాన్ని తెలుసుకోవటం జరిగింది.





2 జూన్, 2022 నాడు హైదరాబాద్ లోని 'స్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల'లో "ఉన్నత భారత్ అభియాన్, స్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల, పల్లెసృజన, క్రియేటివ్ మైండ్స్" ఆధ్వర్యంలో రైతుల కోసం రైతులు తయారు చేసిన యంత్ర పరికరాలపై బాచారం గ్రామంలో జరిగిన ఒక్కరోజు అవగాహన సదస్సు దృశ్యాలు.



30 ఏప్రిల్, 2022న సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ & పిజి కళాశాలలో జరిగిన 'ఇన్నోవేషన్ల సదస్సు - క్రియేటివిటీ ఎట్ గ్రాస్‌రూట్స్' కార్యక్రమం మీద జరిగిన ఒకరోజు ప్రదర్శన మరియు సెమినార్ దృశ్యం.



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎస్.వి.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## వ్యవసాయ వ్యర్థాలను ఎరువుగా మార్చే యంత్రం

**సమస్య – పరిష్కారం :**

సేంద్రియ వ్యవసాయ విధానంలో 'కంపోస్టు' ఎరువుకున్న ప్రాధాన్యత మరి దేనికీ లేదు. వ్యవసాయ వ్యర్థాలు, ఇళ్ళలోని చెత్తతో కంపోస్టు చేసుకోవచ్చు అని అందరికీ తెలుసు. కాకపోతే దానికి సాధారణంగా 3–4 నెలల సమయం పడుతుంది. ఈ కాల పరిమితిని తగ్గించే యంత్రాలు విదేశాల్లో మాత్రమే లభించేవి. కానీ 'ఉర్మిల్ సింగ్ ధోన్సీ' అనే రాజస్థాన్‌కు చెందిన ఇన్నోవేటర్ ఈ ప్రక్రియని కేవలం 25 నుండి 40 రోజుల లోపలే చేసే పరికరాన్ని కనుగొన్నాడు. అతను చెప్పినదాని ప్రకారం ఈ యంత్రం ద్వారా కంపోస్టు తయారు చేయటానికి టన్నుకు కేవలం 2 రూపాయలు ఖర్చవుతుంది.

**పరికరం :**

చెత్తను తిరగవేయటం యంత్రం సహాయంతో జరుగుతుంది. ఈ యంత్రాన్ని ట్రాక్టర్‌కు అనుసంధానం చేసుకోచవచ్చు. యంత్రంలో భాగంగా ఒక రోటర్ షాఫ్ట్‌కు కొన్ని బ్లేడ్లు అమర్చబడి వుండి ఆ బ్లేడ్లు తిరుగుతూ చెత్తను తునకలు చేస్తూ, తడి కూడా అందజేస్తాయి. ఎండాకాలంలో 5 రోజులకోసారి, చలి కాలంలో 7 రోజులకోసారి చొప్పున 5–6 సార్లు చెత్త కుప్పపైకి ఈ యంత్రాన్ని తోపుకుంటూ వెళ్ళితే చాలు. అదే చెత్తను బాగా కలిపి నీరు అందించటం వల్ల ఆ చెత్త కంపోస్టుగా తయారవుతుంది.

**సాంకేతిక వివరాలు :**

- 400 టన్నుల చెత్తను ఒక గంటలో కలియ గలుపుతుంది.
- గంటకు మూడున్నర నుంచి నాలుగు లీటర్ల డీజిల్ ఖర్చవుతుంది.
- 50 హెచ్‌పి ట్రాక్టర్‌కు దీన్ని అనుసంధానం చెయ్యవచ్చు.
- రోటర్ 16 అంగుళాల వ్యాసం, 9 అడుగుల పొడవు కలిగి వుండి, 9 బ్లేడ్లు అమర్చబడి వుంటాయి.







❀ క్రోమ్ స్టీల్‌తో తయారు చేయబడిన ప్రత్యేకమైన గేర్‌బాక్స్ సహాయంతో వేలకొద్దీ టన్నుల వ్యవసాయ వ్యర్థాలను, గృహ వ్యర్థాలను కంపోస్టుగా తయారు చేసుకోవచ్చు.

❀ రోటర్‌ను క్రిందకు, పైకి కదపటానికి అనువుగా హైడ్రాలిక్ సదుపాయం కలదు.

❀ 2000 లీటర్ల సామర్థ్యమున్న నీటి ట్యాంకు అమర్చబడి వుంటుంది.

**ముఖ్యాంశాలు :**

❀ ఈ యంత్రం సహాయంతో 120 నుండి 150 రోజుల్లో తయారయ్యే కంపోస్టు 25–40 రోజుల్లోనే తయారు చేయవచ్చు.

❀ పేడ కంపోస్టుకన్నా ఈ వర్మి కంపోస్టులో పోషక విలువలు ఎక్కువ.

❀ ఈ పనంతా ఒకేవ్యక్తి చేసుకోవచ్చు.

❀ నిరుద్యోగులకు, ఎక్కువ కంపోస్టు అవసరమైన వారికి ఇది ఎంతో అనువైన యంత్రం.

❀ నలుగురు నిరుద్యోగులు ఈ యంత్రాలను పట్టణాల్లో ఏర్పాటు చేసుకుంటే వారికి ఉపాధి, రైతులకు తక్కువ ధరలో సేంద్రియ ఎరువు అందించటంతో పాటు, పట్టణాలను చెత్త దుర్గంధం నుండి కాపాడి ఆరోగ్యకరమైన వాతావరణం అందించవచ్చు.

**పురస్కారాలు :**

❀ ఇన్నోవేటర్ 'గుర్మిల్‌సింగ్ ధోన్సీ' కి ఎన్ఐఎఫ్ వారు 2012లో 'ఉత్తమ సాంప్రదాయ జ్ఞానం' బహుమతిని అందజేశారు.

## పాలు పితికే యంత్రం

**సమస్య – పరిష్కారం :**

డెయిరీ ఫారంలు, ఎక్కువ పాడిపశువులు వున్న వారికి పశువులనుండి పాలు పితకడం ప్రధాన సమస్య. నేర్పరులైన కూలీలు లభించటం కూడా దుర్లభంగా మారుతోంది. పైగా చేత్తో పితకడం అన్నది ఆరోగ్యకరమైన పద్ధతి కాదు అన్న భావన ప్రబలుతోంది. పాలు పితకటానికి యంత్రాలున్నా, చాలా ఎక్కువ పెట్టుబడి కావాల్సి వస్తోంది. ఈ సమస్యకి పరిష్కారంగా కర్నాటకకు చెందిన 'రాఘవ గౌడ' తక్కువ



ఖరీదులో పాలు పితికే యంత్రాన్ని తయారు చేశాడు.

**పరికరం :**

ఇది చేతితో నడిపే విధంగా, యంత్ర సహాయంతో పని చేసే విధంగా రెండు రకాలుగా తయారు చేశాడు. తక్కువ పాడి పశువులున్న వారు కూడా దీనిని కొనుగోలు చేసి ఉపయోగించుకోవచ్చు. దీన్ని ఉపయోగించటం చాలా సులభం. స్త్రీలు కూడా సులభంగా ఉపయోగించుకోవచ్చు.

**సాంకేతిక వివరాలు :**

❀ ఈ యంత్రం తయారీలో మేలురకపు స్టీలు ఉపయోగించ బడినది.

❀ 18 కిలోల బరువున్న చేతితో నడిపే ఈ యంత్రం సహాయంతో ఒకసారి, ఒక పశువు నుండి పాలు పితకవచ్చు.

❀ సెమీ ఆటోమేటిక్‌లో కరెంటు లేదా బ్యాటరీతో పని చేసే యంత్రాలు కూడా అందుబాటులో వున్నాయి.

**ముఖ్యాంశాలు :**

❀ ఒక పశువుకు పాలు పితకటానికి కేవలం 4 నుండి 6 నిమిషాలు పడుతుంది.








❀ నిమిషానికి ఒకటిన్నర నుండి 2 లీటర్ల పాలు పితక వచ్చు.
❀ చేత్తో పాలు పితకడం వుండదు కనుక పూర్తిగా ఆరోగ్య ప్రదాయమైనది.
❀ పశువుకు ఎటువంటి హాని కాని, అసౌకర్యం కాని కలగదు.
❀ ఎటువంటి ఖర్చు లేకుండా 8 నుండి 10 సంవత్సరాల వరకు పని చేస్తుంది.

**పురస్కారాలు :**
❀ 2005లో ఇన్నోవేటర్ రాఘవ గౌడకు ఈ యంత్రం కనిపెట్టినందుకు గాను ఎన్ఐఎఫ్ వారు నాటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతులమీదుగా పురస్కారం అందించడ మైనది. ●

**వివరాలకు సంప్రదించండి:**
**సుభాష్ చందర్**, ఫోన్ : 040–27111959, మొబైల్ : 9652801700.

# 'పల్లెసృజన' ఇన్నోవేటర్లకు విజ్ఞప్తి

'పల్లెసృజన' పత్రిక అప్రతిహతంగా 16 సంవత్సరాలుగా మీ ముందుకు వస్తున్న విషయం మీకందరికీ విదితమే. స్వచ్ఛందంగా వాలంటరీ వ్యవస్థ మీద ఆదారపడి, ఎటువంటి వ్యాపార ప్రకటనలు, డొనేషన్‌లు లేకుండా ఇప్పటి వరకు ఈ పత్రికను తద్వారా నూతన ఇన్నోవేషన్లను, ఇన్నోవేటర్లను మీకు పరిచయం చేస్తూ వారికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకు వస్తున్న విషయం కూడా మీకు తెలుసు.

కోవిడ్ మహమ్మారి ప్రపంచ వ్యాప్తంగా సృష్టించిన అలజడి లో కూడా నిరాఘాటంగా పత్రిక నడిపే ప్రయత్నంలో సఫలీకృతులం అయ్యాము. కానీ, రోజు రోజుకూ పెరిగి పోతున్న పేపర్ ధరలు, ముద్రణా ఖర్చులను తట్టుకోవటం కొద్దిగా కష్టంగా మారుతోంది. కావున దయచేసి ఇన్నోవేటర్లు ఒక విషయం గమనించాలి. ఇప్పటి నుంచి మీకు చేరుతున్న పత్రిక ఉచితంగా పంపడం కొంత భారంగా అనిపిస్తోంది. కావున మీ పత్రికకు మీరు కూడా చందాదారులు కావలసిందిగా కోరుతున్నాము.

మీరు పత్రికకు అందిస్తున్న సహకారం మమ్మల్ని ఎప్పటికప్పుడు కార్యోన్ముఖులను చేస్తూ ఆనందంగా ముందుకు సాగేలా చేస్తోంది. కావున మీకు తెలిసిన వారికి, మీ మిత్రులకు ఈ పత్రికను గురించి తెలియజేసి, కొత్త చందా దారులను చేరేలా మీవంతు ప్రయత్నం చేయ గలరు. వీలైనంత వరకు పత్రిక ధర పెంచకుండా, చందా దారులను అధికం చేసినట్లయితే ముద్రణా ఖర్చు కొంత వరకు తగ్గుతుందని భావిస్తున్నాము. 'పల్లె సృజన' ప్రతి పల్లెకు చేరాలన్నదే మా ఆకాంక్ష. శుభ కార్యాలలో ఈ పత్రిక చందానే మీరిచ్చే బహుమతిగా చేసుకుని పత్రిక ఎక్కువ మందికి చేరేలా సహకరిస్తా రని ఆశిస్తున్నాము.

– ఎడిటర్.

# పల్లెసృజన

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

'పల్లెసృజన' ఒక స్వచ్ఛంద సంస్థ. దీని నిర్వాహకులు, వాలంటీర్లు అంతా స్వచ్ఛందంగా పనిచే స్తారు. గ్రామాల్లోవున్న సృజనాత్మకతను వెతికి, సమాజానికి తెలియపరచడం, సృజనాత్మకత గల వ్యక్తులను (ఇన్నోవేటర్స్‌ను) గౌరవించి వారిని ప్రపంచానికి పరిచయం చేయాలన్న ప్రధాన లక్ష్యంతో 2005లో 'పల్లెసృజన' స్థాపించబడింది. చదువుకోని గ్రామ ప్రజల్లో కూడా శాస్త్రవేత్తలు ఉన్నారని త్రికరణశుద్ధిగా నమ్ముతుంది 'పల్లెసృజన'. అలాంటి జ్ఞానవేత్తల జ్ఞానాన్ని గుర్తించి, గ్రంథీకరించి, ఆ జ్ఞానాన్ని సమాజానికి అందించటంతో పాటు ఆ జ్ఞానకర్తను సమాజం గుర్తించేలా చేయటం 'పల్లెసృజన' ప్రధాన కార్యక్రమం. జ్ఞానశోధనకై 'పల్లెసృజన' ఆధ్వర్యంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి 3 రోజుల పాటు మారుమూల గ్రామీణ ప్రాంతాల గుండా కేవలం ప్రకృతిని ఆస్వాదిస్తూ, జ్ఞానాన్ని వెతుక్కుంటూ సాగుతుంది 'చిన్నశోధయాత్ర'.

అలాంటి 'చిన్న శోధయాత్రలు' ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వున్న 'పల్లెసృజన' అభిమానులు, వాలంటీర్ల సహకారంతో సేకరించిన 'గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్స్'ను "పల్లెసృజన" పత్రిక ద్వారా వెలుగులోకి తీసుకు రావటంతో పాటు జాతీయ స్థాయిలో "నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్", "హనీబీ నెట్‌వర్క్" లాంటి సంస్థలతో మమేకమై సేకరించిన జ్ఞానాన్ని గ్రంథస్థం చేస్తుంది. అలా వారి జ్ఞానానికి గుర్తింపు తీసుకు వచ్చే ప్రయత్నంలో ప్రారంభం నుంచి నేటి వరకు ముగ్గురు గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్స్‌కు "పద్మశ్రీ" పురస్కారాలు, 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్" (ఎన్.ఐ.ఎఫ్.) ద్వారా 14 మంది గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్స్‌కు 'రాష్ట్రపతి పురస్కారం', నలుగురు ఇన్నోవేటర్లకు అంతర్జాతీయ పురస్కారాలతో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయి పురస్కారాలు ఎందరో ఇన్నోవేటర్లకు అందించటం ద్వారా వారికి సమాజంలో సమున్నత స్థానాన్ని కల్పించగలిగింది.

ఇలా తయారైన ఇన్నోవేషన్లను "క్రియేటివ్ మైండ్స్" అను బంధ సంస్థ సహకారం తో వాటిని ప్రజలకు చేరవేసేలా చర్యలు చేపట్టింది "పల్లెసృజన".

దేశీయ జ్ఞానాన్ని వెలుగులోకి తీసుకువచ్చి, దేశీయ జ్ఞానంతోనే ఏ దేశమైనా అభివృద్ధి చెందుతుంది అని నిరూపించాలన్నదే "పల్లెసృజన" సంకల్పం.

**అమ్మకానికి సిద్ధంగా వున్న ఇన్నోవేషన్లు....**

| | | |
|---|---|---|
| ❀ సీడర్లు (6), | ❀ నీరు తోడే మినీ పంపులు (4), | ❀ కరెంటు స్తంభాలను ఎక్కే పరికరాలు (3), |
| ❀ వీడర్లు (14), | ❀ ట్రాక్టర్ లిఫ్టర్లు & లెవెలర్లు (3), | ❀ వృద్ధులు, పేషెంట్ల కొరకు సకల సౌకర్యాల మంచము (3), |
| ❀ రొటోవేటర్లు (4), | ❀ మినీ ట్రాక్టర్లు (5), | ❀ ఎలక్ట్రిక్ & ఎలక్ట్రానిక్ పరికరాలు (12), |
| ❀ స్ప్రేయర్లు (16), | ❀ మినీ రైస్ మిల్లు (2), | ❀ ఇంటి అవసరాల కోసం హెర్బల్ ద్రావకాలు, |
| ❀ హార్వెస్టర్లు (6), | ❀ ఫుడ్ ప్రాసెసింగ్ యంత్రాలు (10), | ❀ ఆవు పేడతో వస్తువులు చేసే పరికరాలు (14). |
| ❀ నూర్పిడి పరికరాలు (9), | ❀ ఇటుకల తయారీ యంత్రాలు (2), | ❀ 48 డిగ్రీల ఎండలో కూడా పండే 'HRMN - 99' ఆపిల్ మొక్కలు |
| ❀ చేతి పనిముట్లు (8), | ❀ గ్రామీణ రవాణా యంత్రాలు (8), | ❀ మూలికా / సేంద్రియ పురుగు మందులు |
| ❀ మాన్యువల్ వీడర్లు (5), | ❀ కొబ్బరి మరియు ఇతర చెట్లు ఎక్కే పరికరాలు (3), | |
| ❀ వ్యవసాయ పనిముట్లు, | | |

**పై ఇన్నోవేషన్లు కావలసిన వారు సంప్రదించ గలరు :**

**సుభాష్ చందర్,** సి.ఇ.ఓ., **"క్రియేటివ్ మైండ్స్"**

ఫ్లాట్ నెం. 77, రోడ్ నెం. 3, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ – 500 094.

ఫోన్ : 040–40253096, మొబైల్ : 9652801700.

# ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞానం

'హనీబీ' ఆంగ్ల పత్రిక సౌజన్యంతో

Loksarvani
(Gujarati version of Honey Bee)
SRISTI, P O Box No. 15050
Ambawadi, Ahmedabad - 380015, Gujarat
loksarvani@sristi.org

21101

**పశువుల్లో నులిపురుగుల నివారణకు:**



పశువుల పోషణ లో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా వాటి ప్రేవుల్లో నులి పురుగులు ఏర్పడి అవి తిన్నది అరగక బాధ పడుతూ వుంటాయి. అశ్రద్ధ వహిస్తే పశువు క్రమంగా క్షీణించి మరణించే ప్రమాదముంది. పశువులలో నులి పురుగుల నివారణకు బజార్లో చాలా మందులు దొరుకుతున్నాయి కానీ గుజరాత్ రాష్ట్రం, బరూచ్ జిల్లా, కంబూడి గ్రామానికి చెందిన 'ఫుల్జీభాయ్ ఉమార్ భాయ్ వాస్వా' మన చుట్టుప్రక్కల దొరికే చెట్లతోనే వీటికి ఉత్తమమైన చికిత్స అందించవచ్చు అంటున్నారు. ఈయన పద్ధతి ప్రకారం 100 గ్రా. వేపాకులు, 100 గ్రా. దానిమ్మ ఆకులను మెత్తగా నూరి, 400 మి.లీ. నీటిలో కలపాలి. ఒక గంట తర్వాత ఆ మిశ్రమాన్ని బాగా కలిపి రోజుకొకసారి చొప్పున రెండు మూడు రోజులు పశువుకు తాగిస్తే నులిపురుగుల నుండి నివారణ పొందవచ్చు అంటున్నాడు.

21102

**పంటలలో రసం పీల్చే పురుగుల నివారణకు:**

ఈ రసం పీల్చే పురుగు ఏ పంటకైనా, మొక్కకైనా సోకి చెట్టు ఆకులలోని రసాన్ని పీల్చేసి మొక్కలను నిర్వీర్యం చేసి అవి నశించిపోయేలా చేస్తాయి. వీటి నివారణకు గుజరాత్‌కు చెందిన 'పరుషోత్తమ్ భాయ్' చక్కటి, తేలికైన ఉపాయం చెపుతు న్నాడు. ఈయన చాలాకాలం గా తన పొలంలో ఇదే పద్ధతి ని వాడుతున్నాడట. ఈయన వేపాకులు, మజ్జిగ తేటను ఉపయోగించి ఈ ద్రావకాన్ని తయారు చేసుకుంటాడు. వేపాకులను నీటిలో వేసి ఆ నీరు మూడవ వంతుకు వచ్చే వరకు మరగబెట్టి, 200 మి.లీ. ఆ కషాయాన్ని తీసుకుని, 1500 మి.లీ. మజ్జిగ తేటలో కలిపి పొలాలపై పిచికారి చేస్తే ఈ రసం పీల్చే పురుగు నుండి నివారణ పొందవచ్చు అని



చెపుతున్నాడు.

21103

**వెల్లుల్లి పంటను చీడనుండి కాపాడటానికి:**

గుజరాత్ రాష్ట్రానికి చెందిన 'పరుషోత్తమ్ భాయ్' ఈ ఉపాయం కూడా చెబుతు న్నారు. భారత సుగంధ ద్రవ్యాల బోర్డు లెక్కల ప్రకారం 2002-2007 మధ్యలో గుజరాత్ రాష్ట్రంలో వెల్లుల్లి ఉత్పత్తి 480 శాతం పెరిగింది. ప్రత్యేకించి జునాగఢ్ జిల్లాలో అత్యంకంగా వెల్లుల్లి పండిస్తుం టారు. ఆ జిల్లాలోని రైతులు వెల్లుల్లి పంటను కాపాడటానికి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాన్నిచ్చే సేంద్రియ పద్ధతిని పాటిస్తున్నారు. దాన్ని పరుషోత్తమ్ భాయ్ మనకు తెలియజేస్తున్నారు.



మజ్జిగ, గోమూత్రము, కుళ్ళిపోయిన సజ్జలపిండి ఈ మూడింటిని బాగా కలిపి వెల్లుల్లి పంటపై పిచికారి చేసి పంటను చీడల నుండి రక్షించుకోవచ్చు అని చెపుతున్నారు.

ఇంకొక రైతు 'రమేష్ భాయ్' మరో పద్ధతి వాడి తన వెల్లుల్లి పంటను చీడనుండి కాపాడుకుంటున్నాడు. ఆయన ఆముదము, నీరు, బట్టలుతికే సోడాను కలిపి ఈ ద్రావకాన్ని తయారు చేసుకుంటాడు. ఒకటిన్నర లీటర్ల ఆముదము, 100 గ్రా. బట్టలుతికే సోడా, 20 లీటర్ల నీటిలో కలిపి పంటకు నీరు పెట్టిన తర్వాత రెండుమూడు సార్లు పంటపై పిచికారి చేస్తే మంచి ఫలితం వుంటుందని చెపుతున్నారు.

21104

**మిరప పంటను తెగుళ్ళనుండి కాపాడటానికి:**

గుజరాత్‌కు చెందిన 'పరశురామ్ భాయ్' ఈ చిట్కా కూడా చెప్తున్నారు. మిరప పంటను తెగుళ్ళ బారినుండి రక్షించుకోవటానికి ఆయన నిమ్మ, కలబంద, పొగాకులను కలిపి వాడుతుంటాడు. ఆయన 2 కిలోల పొగాకు పొడి, 2 కిలోల కలబంద, 250 గ్రా. నిమ్మరసం లను 20 లీటర్ల నీటిలో కలిపి మరిగిస్తాడు. 250 మి.లీ. ఈ ద్రావకంలో 15 లీటర్ల నీటిని కలిపి 8 రోజులకొకసారి మిర్చి పంటపై పిచికారి చేస్తాడు. ఈ పద్ధతి వలన మిరప పంటలో 80 శాతం వరకు తెగుళ్ళను నివారించగలిగానని చెప్తున్నాడు.

21107

**వరి, మినుము పంటలలో చీడల నివారణకు:**

వరి మినుము పంటలను చీడలు సోకి చాలా నష్టాన్ని కలిగిస్తుంటాయి. దీని నివారణకు అనేక ఖరీదైన రసాయన పద్ధతులు వాడినా స్వచ్ఛమైన సేంద్రియ పద్ధతి ఒకటి వుంది అంటున్నారు గుజరాత్ రాష్ట్రం లోని బనస్కాంత ప్రాంతానికి చెందిన 'జమాల్ భాయ్ నూరాభాయ్ మోడీ'. ఈయన పులికంప చెట్టు ఆకులు, పొగాకు, రేలకాయలు (రోడ్ల పక్కలో విరివిగా లభించే నల్లని పొడగాటి కాయలు,



ఈ చెట్లు పూత పసుపు వర్ణంలో వుంటుంది) ను కలిపి తయారు చేసుకుంటాడు. రెండు లీటర్ల ద్రావకం తయారు చేసుకోవటానికి ఆయన 200 గ్రా. పులికంప ఆకులు మరియు పూలు, 200 గ్రా. పొగాకు చెట్టు వేర్ల పొడి, 200 గ్రా. రేల కాయల పొడిని మూడు లీటర్ల నీటిలో కలిపి ద్రావకం రెండు లీటర్లు అయ్యేంత వరకు మరగబెట్టాలి. ఈ కషాయాన్ని నీటిలో కలిపి పంటలపై పిచికారి చేస్తే మంచి ఫలితముంటుంది.

**బెండ పంటను చీడ పీడల నుండి కాపాడటానికి :**

గుజరాత్ రాష్ట్రంలోని సురేంద్రనగర్ జిల్లా, హన్వాడ్ తాలూకా, మాయానగర్ గ్రామ నివాసి 'జనక్ కుమార్ వ్రజిలాల్ చౌహాన్' తన బెండ పంటను చీడ పీడలనుంచి కాపాడటానికి స్వయంగా ఓ పద్ధతిని కనుగొన్నాడు. ఈయన మెంతుల పొడిని ఉపయోగించి, ఒక ద్రావకాన్ని తయారు చేసుకుంటాడు. ఇది వాడటం వలన మంచి ఫలితం వుంటుంది అని చెపుతున్నారాయన. దీనికై ఆయన మెంతులను మెత్తగా



నూరి పొడి చేసుకుని, ఒక కిలో పొడిని నీటిలో కలిపి మూడు రోజులపాటు మురగనిస్తాడు. మూడు రోజుల తర్వాత ఈ పొడి కొంత చిక్కగా, జిగురుగా మారుతుంది. ఆ చిక్కటి ద్రావకాన్ని మెత్తని చీపురుతో పంటపై చిలకరిస్తాడు. ఈ మెంతులకి వున్న ప్రత్యేకమైన వాసన చీడపీడలను, పురుగులను మొక్కల దగ్గరికి రానీయదు.

**ఆకుముడత పురుగు నివారణకు :**

చాలా రకాల పంటలలో ఆకుముడత తెగులు పంటకు ఎంతో నష్టాన్ని చేకూరుస్తుంది. ఈ తెగులు ప్రత్యేకించి, చలికాలం, మేఘావృతమైనప్పుడు ఎక్కువగా సోకుతుంది. దీని నివారణకు గుజరాత్ రాష్ట్రం, సురేంద్రనగర్ జిల్లా, హన్వాడ్ తాలూకా, దేవీపూర్ గ్రామ నివాసి 'మహేష్ భాయ్ జయరామ్ భాయ్ లఖాత్రియా' గన్నేరు చెట్లను ఆశ్రయిస్తాడు. ఇది పూర్తి సేంద్రియ పద్ధతే అని చెపుతాడాయన. ఆయన రెండు కిలోల గన్నేరు ఆకులను తీసుకుని, మెత్తగా నూరి ముద్దచేసి, ఆ ముద్దను 5 లీటర్ల నీటిలో కలిపి ఐదారు రోజులపాటు మురగబెడ్తాడు. తర్వాత ఈ ద్రావకాన్ని కొద్దిసేపు మరిగించి, 150 మి.లీ. ఈ మరిగించిన ద్రావకంలో 15 లీటర్ల నీటిని కలిపి పంటపై ఆకుల క్రింద భాగానికి తగిలేలా పిచికారి చేస్తాడు. దీంతో ఆకుముడత తెగులు సమర్థవంతంగా అరికట్ట బడుతుంది అంటారు. ఈ ద్రావకాన్ని మురగబెట్టేటప్పుడు గాలి పారకుండా మూత పెడితే త్వరగా మురిగిపోతుందట. ఈద్రావకం బూజు తెగులుకు కూడా బాగా పనిచేస్తుంది అంటారాయన.



## పాఠకులకు విన్నపము

మీ ప్రాంతంలో కూడా పంటల పైన కాని, పశువుల పైన కాని చేసిన, చేస్తున్న ప్రయోగాలను గురించి వివరంగా తెలియజేస్తే మీ పేరున ఈ 'పల్లె జ్ఞానం' సమాజానికి తెలియజేస్తాము. పంటల తెగుళ్ళ నివారణ, పశువుల రోగాల నివారణకు సంబంధించిన మీకు తెలిసిన లేదా మీరు విజయవంతంగా ప్రయోగించిన పద్ధతులను తెలియజేయండి.

-ఎడిటర్

తెలుగు అనువాదకుడు : అర్విణీ రాజేంద్ర బాబు, సంపాదకుడు : కుప్పా వేంకట కృష్ణమూర్తి. I SERVE, హైదరాబాద్ వారి సౌజన్యంతో...



# వృక్షాయుర్వేదము

(అనేక అనుబంధవ్యాస సహితము)

## సురపాలుని సంస్కృత గ్రంథానికి తెలుగు అనువాదము

కాల, ప్రాంతాలకు అతీతంగా శాస్త్ర విజ్ఞాన జిజ్ఞాస మానవాళిని అంటిపెట్టుకునే వుంది. ప్రాచీన భారత దేశంలో వివిధ రంగాలలో విశేష కృషి చేసిన మహనీయులు విజ్ఞానాన్ని బహు ముఖాలుగా విస్తరించే ప్రయత్నం చేసిన ఆలోచనాపరులు కోకొల్లలు. ఆర్యభట్టు, వరాహమిహిరుడు, చరకుడు, సుశ్రుతుడు, భాస్కరుడు మొదలైన వారు ఖగోళము, గణితము, వైద్యము లాంటి శాస్త్రాలలో తమ పరిశోధనల ద్వారా కొన్ని మైలురాళ్ళను సృష్టించారు. ఆ కోవలోకి చెందిన వారే 'సురపాలుడు'.

వృక్ష శాస్త్రంలో నిగూఢమైన విషయాలను ఎన్నింటినో పరిశోధించి, అపురూపమైన వృక్ష వైద్య రహస్యాలను గ్రంథస్తం చేసినవాడు సురపాలుడు. మొక్కల లక్షణాలు కూడా మానవుల శరీరాన్ని పోలి వుంటుందన్న శాస్త్ర పరిజ్ఞానాన్ని ఆవిష్కరించినవాడు సురపాలుడు. వృక్ష శాస్త్రంలో విశేషమైన కృషి చేసిన ఈ మహనీయుడి గురించిన సమాచారం ఇటీవలి వరకు మన దృష్టికి రానేలేదు. ఆయన రచించిన "వృక్షాయుర్వేదం" అన్న గ్రంథం ఇంగ్లాండులోని ఒక గ్రంథాలయంలో ఇటీవలే బయట పడింది. ఆ పుస్తక ఆంగ్లానువాదం 'ఏసియన్ అగ్రో హిస్టరీ ఫౌండేషన్ (ఎఎహెచ్ఎఫ్), హైదరాబాద్ వారు 1996లో ప్రచురించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వృక్ష శాస్త్రం పట్ల ఆసక్తిగల ప్రతి ఒక్కరికీ ముఖ్యంగా పరిశోధకులకు, విద్యార్థులకు, రైతులకు అందుబాటులోకి తీసుకు రావాలన్న ఉద్దేశ్యంతో 'ఐ-సర్వ్', హైదరాబాద్ వారు 2015 లో తెలుగు అనువాద ప్రక్రియకు ఉపక్రమించడం జరిగింది.

ఈ గ్రంథాన్ని 'పల్లెసృజన' పాఠకులకు అందించాలన్న సంకల్పంతో మే-జూన్, 2021 సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం. ఈ గ్రంథంలోని మహత్తరమైన జ్ఞానాన్ని పాఠకులు అవగాహన చేసుకుని, ఆచరిస్తారని ఆశిస్తున్నాం. -ఎడిటర్.

**(గత సంచిక తరువాయి)**

261. మనిషి లోతంత గొయ్యి తవ్వి, లోపలి వైపునుండి ఇటుకలు పేర్చి, ఆ గొయ్యిలో చెట్టును నాటి, ఒక వ్యక్తి ఎవరైనా నమ్మకంగా తన ప్రయత్నంతో పెంచితే, మరుగుజ్జుగా వున్న చెట్టయినా సరే సమృద్ధిగా పూలు, పండ్లు కాస్తుంది.

262-263. అంతగా మృదువుగా లేని ఒక మొక్కను కాండము దగ్గర తుంచివేసి కొద్దిగా కాల్చాలి. ఆ తర్వాత నెయ్యి, ఆవుపేడ, సైంధవ లవణము, తేనలతో తయారు చేసిన మిశ్రమాన్ని ఆ కాల్చిన కాండానికి బాగా పూయాలి. ఒక చిన్న మేకును ఏటవాలుగా దాని వేరు లోపలికి దూర్చాలి. తదుపరి పాలు కలిపిన నీళ్ళు ఆ మొక్కకు పట్టాలి. ఇలా చేస్తే ఆ మొక్క ఏపుగా పెరిగి అందమైన కొమ్మలు వస్తాయి. చిన్నగా ఉన్నప్పుడే పళ్ళు కూడా కాస్తాయి.

264. ఒక గోతిలో వేర్ల దగ్గరలో నాలుగు గుంజలను పాతి, వాటి మధ్య మొక్కను నాటి, దానికి జాగ్రత్తగా పాలు కలిపిన నీళ్ళు పట్టినచో ఆ మొక్కలు గుజ్జు రకమయిన చెట్లుగా పెరుగుతాయి.

265. వివిధ రకాలయిన తామర మొక్కను వేళ్ళ దగ్గర ఉండే గడ్డలతో సహా పెరికి, అన్నింటిని కలిపి దారాలతో గట్టిగా కట్టి, వాటికి కరిగించిన వెన్న, తేనె పూసి, మట్టి నాటితే, ఒకే తీగపై వివిధ రకాలైన తామర పువ్వుల గుత్తులు గుత్తులుగా పూస్తాయి.

266. అదేవిధంగా "కరవీర" (గన్నేరు) మరియు వివిధ జాతులకు చెందిన దానిమ్మ మొక్కల కాడలను ఒకేచోట కట్టగా కట్టి, మొక్కలు పువ్వులు, పండ్లు మార్చివేసే అద్భుతాలు ఎన్నో సాధించవచ్చు.

267-273. .......

274. బియ్యం కడిగిన నీళ్ళను కొబ్బరి చెట్టుకు పోస్తే, చెట్టు అంతమై పోతుంది. అలాగే, వేప ఆకులు కలిపిన నీళ్ళు పత్తి చెట్లకు చెరుపు చేస్తాయి.

275. "హింగు" వృక్షం యొక్క ఒక కర్ర ముక్కను అరటి చెట్టు వేళ్ళ దగ్గర పెడితే, అది అరటి చెట్టును నాశనం చేస్తుంది.

276. కులత్థము (ఉలవలు కావచ్చు), కింశుకము (మోదుగ), అర్జునము (మద్ది), తర్కారి (తక్కిం)ల మిశ్రమంతో తయారు చేసిన కషాయంతో కలిపిననీళ్ళు పట్టడం, ఉప్పును ఆహారంగా వెయ్యడం, లేదా మండించినట్లయితే చెట్ల నుండి పూలు పండ్లు రాలి పోతాయి.

277. 'అంకోల' తైలము, 'నార' (అర్జున...?) తైలములను రెండింటిని కలిపి తయారు చేసిన మిశ్రమంతో సహజంగా పక్వం చెందిన పండులోంచి వేరు చేసిన విత్తనాన్ని చికిత్స చేసి, దానిని మట్టి దిబ్బలో నాటి, కొబ్బరి నీళ్ళు (తుఫాను వచ్చే నీరు?) చిలకరించిన ఆ విత్తనం వెంటనే మొలకెత్తడంలో ఆశ్చర్యం లేదు.

278. ..........

279. "శ్లేశ్మట" తైలములో వందసార్లు తడిపిన తర్వాత ఏదనా విత్తనాన్ని నాటి, తదుపరి కొబ్బరి నీళ్ళు (తుఫాను ష వచ్చే నీరు...?) పడితే, ఆ విత్తనం వెంటనే మొలకెత్తుతుంది.

280-284.....................

285-286. బూడిద గుమ్మడికాయ, దోసకాయ మొక్కల గట్టి కాండములకు తేనె మరియు కరిగించిన వెన్నను బాగా పట్టించి, ఆ తర్వాత గడ్డి పోచలతో పేనిన తాడుతో కట్టివేసి, ఆవు పేడతో కప్పివేస్తే ఆ రెండు మొక్కలు ఒకటిగా కలిసిపోతాయి. తదుపరి, మొక్క పై భాగము, దాని వేర్లు క్రమ పద్ధతిలో ఉండే విధంగా చూసి కాండమును కోసివేస్తే, దోసకాయలు కూడా గుమ్మడి కాయలంత పెద్దగా కాస్తాయి.

287-288. లేత బూడిద గుమ్మడికాయకు ఒక చిన్న రంధ్రం చేయాలి. తేనె మరియు కరగబెట్టిన వెన్నను బాగా పండిన వేప విత్తును ఆ రంధ్రం లోకి జారవిడవాలి. ఆ గుమ్మడి కాయ బాగా పండిన తరువాత విత్తనాన్ని బయటకు తీసి, గోతిలో తవ్వి నాటాలి. కొంత కాలం తర్వాత కాయలు, పంట రూపంలో అపారమైన ధనాన్ని కొని తెస్తుంది.

289. "ఉత్పల" (కలువ) విత్తనాన్ని గేదె మూత్రం మరియు దాని ఎండి పోయిన పేడతో బాగా మర్దించాలి. తర్వాత సారవంతమైన భూమి లో పాతి పెట్టి, కొబ్బరి నీళ్ళు (కరక జలము - తుఫాను నీరు) పట్టాలి. అది "కరవీర" మొక్కలా పెరుగుతుంది.

290-292........

293. పిల్ల గాలికి మందంగా కదులుతూ నిండా అల్లుకొని ఉన్న అందమైన పూవులు, ఉపరిభ్రమణం చేస్తున్న తేనెటీగలతో నిండి ఉన్న "అతిముక్తత" ఆకుల (పువ్వుల, గురివింద ఆకుల) గుబురుచేత ఉద్యాన వనాలను సూర్య కిరణాల నుండి కాపాడుకోవాలి.

294. ఒడ్డున నిలుచున్న చెట్లు పుష్ప రూపంఅన్న తమ కళ్ళతో తమను తామే చూసుకునే విధంగా, హంసలతో అలంకరించబడిన కోనేరులు నిర్మించాలి.

295. సంతోషాలు పంచే షికారులు చెయ్యడం కోసం పడవలు సులభంగా ప్రవేశించేటట్లు చుట్టూ పూల చెట్లు ఉండే విధంగా జలచరాలు లేని, పెద్ద సరస్సులు నిర్మించాలి. మొలకెత్తే తామర ఆకులతో నల్లగా, కొన్నిచోట్ల అందమైన స్త్రీల కనుపాపలను పోలి వుండేవిధంగా నల్ల కలువలతో "ఉత్పలాల"తోనూ ఆ సరస్సులు కూడి ఉండాలి.

296. నీళ్ళ మధ్యలో ఉద్యానవనం పెరుగుతున్నట్లు స్ఫురించే విధంగా అత్యంత స్వచ్ఛమైన నీళ్ళ చుట్టూవున్న తోట ప్రతిఫలించే విధంగా అనువైన చోట సరస్సు నిర్మించవచ్చు. మరొకచోట ఉందా లేదా అన్న చందంగా చంద్ర కిరణాలు విస్తారంగా నిండి పోయి కనిపించేటట్లు సరస్సు నిర్మించడం సబబు.

297. తోట మధ్యలో నడుమ స్ఫటికంలాగా తెల్లగా అరటి చెట్ల తో నిండిన పందిళ్లు నిర్మించాలి. ఆ పందిళ్ళ మధ్యలోంచి ధారాళంగా మంద స్థాయిలో మారుతం వీచేట్లుగా ఏర్పాటు చేసుకో వాలి. హిమవన్నగము లాగా తెల్లగా ఉండి, గాలి బాగా వీచేటట్లు సువాసనలు వెదజల్లే పుష్పాల బరువుతో నిండిన చెట్లచే కప్పబడి అరటి బోదెలతో తయారయిన ఇళ్ళు ఆ పందిళ్ళ మధ్య ఏర్పాటు చేసుకోవాలి.

298. ఉద్యానవనంలో అనుకూలమైన ఓ స్థలం చూసి, చుట్టూ చెట్లపై నీళ్ళు చిలకరించే ఏర్పాటుతో, చుట్టూ రాళ్ళతో కట్టడం కట్టి ఓ మంచినీటి బావి తవ్వాలి.

299. "అంజనము", "ముస్తము", "ఉశీరము" (సువాసనలు వెదజల్లే 'ఖస్' మొక్కవేరు), 'నాగము, కోశాతకము, ఆమలకము'ల యొక్క చూర్ణాన్ని "కతక", "చిల్లంగి" ఫలాలతో కలిపి క్రమబద్ధమయిన విరామ సమయాలు పాటిస్తూ ఆ మంచినీటి బావిలో ఉంచాలి.



300. ఆ బావిలో వుండే నీరు చేదుగానో, ఉప్పగానో, అసలు రుచి లేకుండానో లేదా రోతైన వాసన కలిగి ఉండి, మడ్డిగా బురదతో కూడుకొని వుంటే, పై విధంగా చికిత్స చేస్తే ఆ నీరు రుచికరంగా, స్వచ్ఛంగా సువాసనలు వెదజల్లే విధంగా ఇంకా అనేక మంచి లక్షణాలు కలిగినవిగా మారిపోతాయి.

**బావుల త్రవ్వకానికి ప్రకృతి సిద్ధమైన భూగర్భ జలాల ఆనవాళ్ళు:**

301. భూమి అడుగు భాగం నుండి జలగమనాలు ఊర్ధ్వ దిశగా పయనించి భూగర్భంలోనే అన్ని దిక్కులా వ్యాపిస్తాయి. వాటిని పరిశోధించి బావుల త్రవ్వకానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.

302. నీళ్ళు లేని ప్రాంతంలో వెదురు బొంగు (చెరుకు కూడా కావచ్చు. ఇంగ్లీషులో కేన్ అంటే రెండు అర్థాలు ఉన్నాయి) పెరిగితే, దానికి మూడు మూరలు దూరంలో, ఒకటిన్నర మనిషి లోతు పశ్చిమం వైపు జలగమనం ఉంటుంది. అదది పశ్చిమ దిశవైపు ఉండే నీటి ప్రవాహం.

303. మనిషిన్నర లోతు త్రవ్విన తదుపరి, తెల్లరంగులో కప్ప మరియు పసుపు పచ్చ రంగులో మట్టి అగుపిస్తే, రాతి పొరల మధ్య ఇంకా దొచ్చుకొని పోతే అక్కడ పుష్కలంగా నీరు లభిస్తుందనడానికి నిదర్శనంగా భావించవచ్చు.

304. జంబు (నేరేడు) వృక్షానికి దగ్గరలో తూర్పు దిక్కున చీమల పుట్ట ఉంటే, ఆ చెట్టుకు దక్షిణ దిక్కున ఇద్దరు మనుషుల లోతులో సమృద్ధిగా నీరు ఉందని అర్థం.

305. మనిషి లోతులో సగం త్రవ్విన తర్వాత చేప ఉన్న ఆనవాలు కన్పిస్తే మట్టి నీలం రంగులో ఉండి, రాయి పావురం రంగులో ఉంటే అక్కడ చాలాకాలం మనగలిగే నీటిజల ఉన్నట్లు అర్థం.

306. 'నిర్గుండి' చెట్టు చుట్టూ చీమల పుట్టలు ఉంటే, దానికి దక్షిణం వైపు మూడుమూరల దూరంలో రెండుంపావు మనుషుల లోతులో ధారాళంగా ఉన్న మంచినీటి జలను కనుగొనవచ్చు. ●

**గమనిక:** పైన కొన్ని సంఖ్యలలో ఖాళీగా ఉంచబడినవి. దానికి కారణం. అక్కడ వివరించిన విధానాలు ఎన్నో రకాల అడవి జంతువుల మాంసం, మరియు ఇతర శరీర భాగాలతో చేయవలసిన పనులు. ఇవి రైతులకు సాధ్యం కాదు, పైగా 'మృగ హింస' చట్టానికి గురయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి వాటిని వివరించటం లేదు.

(తరువాయి భాగం వచ్చే సంచికలో)




భారత పూర్వ రాష్ట్రపతి కీ.శే. డా. ఎపిజె అబ్దుల్ కలాం గారి స్మృత్యర్థం 'హనీబీ నెట్‌వర్క్, సృష్టి, గెయిన్' సంస్థలు 12వ తరగతి వరకు చదువుకుంటున్న బాల బాలికలలోని సృజనాత్మకతను, ఇన్నోవేషన్‌లు చేసే పటిమను ప్రోత్సహించటం కోసం "ఎపిజె అబ్దుల్ కలాం 'ఇగ్నైటెడ్ మైండ్' చిన్న పిల్లల సృజనాత్మకత మరియు ఇన్నోవేషన్" పోటీలు ఏర్పాటు చేయగా, దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాల నుండి సుమారు 9 వేల మంది బాల బాలికలు పాల్గొన్నారు. వాటిని లబ్ధ ప్రతిష్ఠులైన న్యాయ నిర్ణేతలు పరిశీలించి, 9 మంది పిల్లల ఆలోచనలను పురస్కారాలకు ఎంపిక చేసి, మరొక 6 గురి ఆలోచనలకు ప్రోత్సాహక బహుమతులను ఇవ్వటానికి నిర్ణయించారు.

**ఇన్నోవేషన్/ ఆలోచన పేరు :** పార్కింగ్‌సన్ జబ్బు బారిన పడ్డ రోజులలో వణుకు తీవ్రతను పసికట్టే పరికరం.

**విద్యార్థి పేరు :** జాయ్ అభిజిత్ కేన్య, 9వ తరగతి, అర్చిడ్ స్కూల్, బనేర్, పూనె, మహారాష్ట్ర.



**సమస్య :** పార్కింగ్‌సన్ వ్యాధిగ్రస్తుల వణుకును పసికట్టేందుకు పరికరం లేక పోవటం.

**పరిష్కారం :** పార్కింగ్‌సన్ వ్యాధిగ్రస్తులకు తరచూ అవయవాలలో వణుకు స్ట్రోక్ లాగా వస్తూ వుంటుంది. దీని ఆధారంగా వైద్యులు చికిత్స అందించాల్సి ఉంటుంది.



బొమ్మలో చూపించినట్లు ఒక గ్లౌజు (చేతి తొడుగు)లా ఉండే పరికరాన్ని రోగి ధరిస్తే, అది 3-డి పద్ధతిలో రోగి వణుకును కంప్యూటర్ లోని క్లౌడ్ డాటా బేస్‌కి ప్రసారం చేస్తుంది. తద్వారా రోగియొక్క వణుకు వివరాలు కాగితం పైన ఒక గ్రాఫ్ రూపంలో అందజేస్తుంది. దీనిని ఇటు రోగి, అటు డాక్టరు ఇద్దరూ పరిశీలించుకోవచ్చు. దీని ద్వారా వైద్యం చేసే వైద్యుడు వణుకు తీవ్రత ఆధారంగా జబ్బు ఎంత తీవ్రంగా వ్యాపించింది, ఎంత తరచుగా వణుకు వస్తోంది, ఎంత తీవ్రతతో వస్తోంది మొదలైనవి గమనించి, మందుల వివరాలు, ఫిజియో థెరపి (వ్యాయామాల) ప్రణాళికలు మొదలైనవి నిర్ధారించుకోవడం సులభమౌతుంది. ప్రత్యేకించి రోగియొక్క మానసిక పరిస్థితిని అర్థం చేసుకోవడానికి, తద్వారా మరియు వైద్యము అందించటం సులభమౌతుంది.



**ఇన్నోవేషన్/ ఆలోచన పేరు : 'కాంద్ర' (Typha)యొక్క సహాయంతో సేంద్రియ పద్ధతిలో త్రాగునీటిని శుద్ధి చేయుట.**

**విద్యార్థిని పేరు : సేజూతి సర్కార్,** 9వ తరగతి, జవహార్ నవోదయ విద్యాలయ, హౌరా, కలకత్తా.



**సమస్య :** చవకగా, సులభంగా, తక్కువ పరిమాణంలో త్రాగునీటిని శుద్ధి చేసే మార్గాలు లేకపోవటం.



**పరిష్కారం:** భారీ ప్రమాణంలో త్రాగే నీటిని శుద్ధి చేయటానికి అనేక మార్గాలు, పరికరాలు, రసాయనాలు మార్కెట్‌లో దొరుకుతునే ఉన్నాయి. ఇవన్నీ కూడా ఖరీదైనవి, సామాన్యులు భరించలేనివి. పైగా ఇవేవీ సేంద్రియ పద్ధతులు కావు. దీనికై సేజితీ సర్కార్ అనే అమ్మాయి చిన్న పరిష్కార మార్గం కనుగొన్నది. 'త్రిఫా' చెట్టు వేరుని మట్టి లేకుండా శుభ్రం చేసి, ఎండబెట్టి, పొడి చేసి ఉంచుకోవాలి. ఈ పొడిని 10 గ్రా. చొప్పున చిన్న బట్ట సంచి (టీ బ్యాగ్ మాదిరి)లో ఉంచి, శుద్ధి చేయవలసిన అర లీటరు నీటిలో 20 నుండి 30 నిమిషాల వరకు ఉంచినట్లయితే శుభ్రమైన త్రాగే నీరు తయారవుతుంది. ఇది అందరికీ అందుబాటులో ఉండటమే కాకుండా, చవకైనది, సులభమైనది, ఎవరైనా సరే తక్కువ పరిమాణంలో వాడుకోవటానికి చాలా అనువుగా ఉంటుంది.

**ఇన్నోవేషన్/ ఆలోచన పేరు:** సైకిల్ సహాయంతో తక్కువ ఖర్చుతో పని చేసే పురుగు మందు పిచికారి పరికరం.



**విద్యార్థి పేరు :** శ్రయేష్ గేదం 9వ తరగతి, ధ్యానేశ్వర్ విద్యాలయ, నలేబట, బాంద్రా, మహారాష్ట్ర.

**సమస్య :** సామాన్య సన్నకారు రైతులకు అందుబాటు ఖర్చులో పురుగు మందు పిచికారి యంత్రాలు లేకపోవటం.

**పరిష్కారం:** రైతులకు పనికి వచ్చేలా ట్రాక్టర్ లాంటి దానితో అనుసంధా నం చేసి పిచికారి చేసే యంత్రాలు చాలా ఉన్నా, అవి సామాన్య సన్న కారు రైతులకు అందుబాటులో లేవు. దానికి పరిష్కారంగా 'శ్రయేష్ గేదం' అందరికీ అందుబాటులో ఉండే సైకిల్ సహాయంతో పొలంలో పిచికారి చేసుకొనే పరికరాన్ని సూచించాడు. ఇది



పొలం దున్నటానికి కూడా పని చేస్తుంది. ఎంత చిన్న రైతుకైనా సులభంగా, తక్కువ ఖర్చుతో సేద్యం చేసుకోవటానికి ఈ పరికరం చాలా ఉపయోగ పడుతుంది.

**ఇన్నోవేషన్/ ఆలోచన పేరు :** భోజనం చేసేటపుడు ఉపయోగించే బంతి చాపలను చుట్టే పరికరం.



**విద్యార్థి పేరు :** సౌరవ్, 9వ తరగతి, ప్రభుత్వ సీనియర్ సెకండరీ పాఠశాల క్యాంప్, యమునా నగర్, హర్యానా.

**సమస్య:** తరచూ పొడవాటి చాపలను వేయటానికి, చుట్టటానికి సరియైన పరికరం లేకపోవటం.



**పరిష్కారం :** పాఠశాలల్లో లేదా శుభ కార్యాల్లో ఎక్కువ మందికి భోజనాలు ఏర్పాటు చేయాలంటే, కూర్చోవటానికి పొడవాటి బంతి చాపలు వేయటం, తీయటం శ్రమతో పాటు, ఎక్కువ సమయం పట్టకుండా ఆ పని చేయటానికి ఒక పరికరాన్ని 'సౌరవ్' కనుగొన్నాడు.

**ఇన్నోవేషన్/ ఆలోచన పేరు :** ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్ ద్వారా ఇంట్లోకి స్వచ్ఛమైన గాలి.



**విద్యార్థి పేరు :** పార్థవి, 8వ తరగతి, ముకుంద్ లాల్ పబ్లిక్ స్కూల్, యమునా నగర్, హర్యానా.

**సమస్య:** ఇళ్ళల్లో అన్ని గదులలోకి చవకగా స్వచ్ఛమైన గాలి సరఫరా చేసే పద్ధతి లేకపోవటం.

**పరిష్కారం:** మన ఇళ్లల్లో లైట్లు ఫ్యాన్లు ఏర్పాటు చేసుకోవటం కోసం బయటికి కనిపించకుండా గోడల లోపలే 3 లేదా 6 సెం.మీ. పైపులు వేస్తూ ఉంటాము. ఈ పైపులలోనుంచి అవసరమైన వైర్లు తీసుకొని మనకి కావలసిన చోట లైట్లు, ఫ్యాన్లు, స్విచ్ బోర్డులు మొదలైనవి అమర్చుకుంటాము. ప్రతి గదిలోకి ఫ్యాన్లు లేకుండానే స్వచ్ఛమైన గాలి కావాలనుకుంటే, గోడలలో అమర్చిన ఈ పైపులలో ఒక చివర ఇంటి పైకి వచ్చేలా అమర్చి, ప్రతి గదిలో స్విచ్ బోర్డు ప్రక్కన ఆ గదిలోకి వచ్చిన పైపు వద్ద ఒక రంధ్రం ఏర్పాటు చేయాలి. మిద్దె పైన ఉన్న పైపు నుండి ఒక బ్లోయర్ లేదా గాలి పంపు ద్వారా గాలిని పంపినట్లయితే, ప్రతి గదిలో మనం అమర్చుకొన్న రంధ్రం ద్వారా స్వచ్ఛమైన గాలి గదిలోకి ప్రసరిస్తూ ఉంటుంది. కిటికీలు, తలుపులు మూసి ఉంచినా ఆ గాలి ఇంట్లోకి వస్తూనే ఉంటుంది.



**ఇన్నోవేషన్/ ఆలోచన పేరు :** ఎక్కువసేపు ముఖానికి మాస్క్ ధరించటం వలన చెవులపైన వత్తిడి తగ్గించే మార్గం.



**విద్యార్థి పేరు :** దిగంతక బోస్, 12వ తరగతి, మేమారి వియం ఇన్స్టిట్యూషన్, యూనిట్ -2, తూర్పా బర్ధమాన్, పశ్చిమ బెంగాల్.

**సమస్య :** మాస్క్ ధరించినపుడు చెవులపై వచ్చే నొప్పిని తగ్గించే మార్గం లేక పోవటం.

**పరిష్కారం :** కరోనా కాలంలోనే కాక, ఎల్లప్పుడూ మాస్కులు ధరించే డాక్టర్లు, నర్సులు, ఆరోగ్య కార్యకర్తలు, ఫ్యాక్టరీలలో పనిచేసే వారు, పోలీసులు ఎక్కువ సమయం మాస్కులు ధరించటం వలన చెవుల పైన వత్తిడి పడి ఇబ్బందికరంగా ఉండటమే కాక, తలనొప్పి లాంటి సమస్యలు కూడా రావచ్చు. దీనికై 'దిగంతక బోస్' చిన్న, ఒక సులభమైన మార్గం చెబుతోంది. వనికిరాని వంచటానికి వీలయ్యే ప్లాస్టిక్ ముక్క తల వెనుక భాగంలో ఉంచుకొని దానికి మాస్క్ దారాలు లేదా ఎలాస్టిక్ తగిలిస్తే, చెవుల పైన ఏమాత్రం వత్తిడి పడక, ఎంతసేపు ధరించినా ఇబ్బంది లేకుండా ఉంటుంది.



**ఇన్నోవేషన్/ ఆలోచన పేరు :** మొబైల్ సహాయంతో పని చేసే శానిటైజింగ్ మిషన్.



**విద్యార్థి పేరు :** అనికేక్ ప్రశాంత్ రావ్ కకిడే, 10వ తరగతి, స్కూల్ ఆఫ్ స్కాలర్స్, యావత్ మల్, మహారాష్ట్ర.

**సమస్య :** చేతితో తాకకుండా, గదులు, ఆసుపత్రులు, శౌచాలయాలను శుభ్రపరిచే శానిటైజింగ్ మిషన్‌ను పనిచేయించే పద్ధతి లేకపోవటం.

**పరిష్కారం :** శానిటైజ్ చేయవలసిన గదులు, ఆసుపత్రులు, శౌచాలయాలు మొదలైన వాటిలో శానిటైజర్ చిమ్మటానికి (స్ప్రే చెయ్యటానికి) యంత్రాన్ని తోయాల్సిన అవసరం లేకుండా మన మొబైల్ సహాయంతోనే యంత్రాన్ని గది అంతా తిప్పి శానిటైజ్ చేయవచ్చు.



**ఇన్నోవేషన్/ ఆలోచన పేరు :** వృద్ధులు, వికలాంగులకి ఎత్తు సర్దుకునే వీలుగా కుర్చీ.



**విద్యార్థి పేరు :** చార్మి బి. పాండ్య, 10వ తరగతి, శ్రీ వివిధ లక్ష్మి విద్యామందిర్, పాలన్‌పూర్, గుజరాత్.

**సమస్య :** చవకగా, సులభంగా వృద్ధులకి, వికలాంగులకి అనువుగా ఎత్తు మార్చుకునే కుర్చీలు లేకపోవటం.

**పరిష్కారం :** చాలామంది పెద్దలు, వికలాంగులు ఇబ్బంది లేకుండా, కూర్చోవటానికి అనువైన, చవకైన కుర్చీలు లేకపోవటం గమనించిన 'చార్మి పాండ్య' సులభంగా ఎత్తు మార్చుకునే కుర్చీని సూచించింది. కుర్చీ పక్కన చేతికి అందుబాటులో అమర్చిన ఒక హ్యాండిల్ ను ముందుకు వెనక్కు తిప్పటం ద్వారా, కుర్చీ ఎత్తుని ఎవరి ఎత్తుకు తగినట్లు వారికి అనువుగా ఉండేలా మార్చుకోవచ్చు. అంతే కాకుండా, ఆనుకోవటానికి ఉండే చెక్కను కూడా అవసరమైన విధంగా ముందుకి, వెనకకు సరిచేకోవచ్చు. కూర్చునే వ్యక్తి సులభంగా లేచి నిలబడే అవకాశం కూడా ఉంటుంది.



**ఇన్నోవేషన్/ ఆలోచన పేరు :** తలుపులలో పడి వేళ్ళు నలగకుండా రక్షించే పరికరం.



**విద్యార్థి పేరు :** శ్రీసంహిత గుండిమేళ, 10వ తరగతి, కేంద్రీయ విద్యాలయ నెం. 3, గాంధీనగర్, గుజరాత్.

**సమస్య :** ఆటోమేటిగ్గా కాని, బలవంతాన కానీ తలుపులు మూసేటపుడు ప్రమాద వశాత్తు చేతులు నలగకుండా నివారించే పరికరం ఏమీ లేదు.

**పరిష్కారం :** ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్ల సహాయంతో ద్వారానికి, ద్వారబంధానికి మధ్య ఏదైనా అడ్డంకి (చేయి కాని, వేళ్ళు కాని) ఉన్నట్లయితే ఆ విషయం అనుసంధానం చేయబడిన మైక్రో కంట్రోలర్ ద్వారా ఎల్ఇడి బల్బు వెలగడం కాని, లేదా ముందుగా రికార్డు చేసిన శబ్దము, మాటల వలన కానీ తెలుసుకొని తలుపులు వేయటం ఆపివేయవచ్చు. ఫొటో సెన్సిటివ్ సెన్సార్ సహాయంతో తలుపు పడకుండా, లేదా మూయటానికి వీలు లేకుండా మడత బద్దలు (హింజెస్) బిగిసుకునేలా కూడా చేయవచ్చు. దాంతో పొరపాటున తలుపులలో చేతులు నలగటాన్ని నివారించవచ్చు.



Honey Bee Network

gian

# Submit your Ideas, Innovations, Prototypes

## హనీబీ నెట్‌వర్క్
## క్రియేటివిటీ & ఇన్‌క్లూసివ్ ఇన్నోవేషన్ అవార్డులు
## HBN CRIIA

మీవద్ద మనుషులు, పశువులు, పర్యావరణం
ఎదుర్కొనే దైనందిక సమస్యలను
పరిష్కరించే సృజనాత్మక, సాంప్రదాయ
పద్ధతులు లేదా ఆలోచనలు ఉన్నాయా?

ఎవ్వరైనా దరఖాస్తు చేసుకోవచ్చు !

**మీ ఆలోచనలను, ఇన్నోవేషన్‌లను, నమూనాలను పంపండి**

మీ దరఖాస్తులను ఈ చిరునామాకు పంపండి...
Email : gian@gian.org or post them to
GIAN, Bungalow No. 1,
Sattellite Complex, Nr. Mansi Crossroads,
Satellite, Ahmedabad – 380 015. Gujarat
Call us at : 079 26769686



మోటార్ సైకిల్‌తో పని చేసే పొలం దున్నే యంత్రం
మన్సుఖ్‌భాయ్ జగాని, గుజరాత్

ఎంపికైన ఆలోచనలు, నమూనాలను
HBN CRIIA పురస్కారంతో సత్కరించటంతో పాటు,
అవి కార్యరూపం దాల్చటానికి తగ్గ
ఆర్థిక / ఇతర సహాయం కూడా చేయబడుతుంది.

ఎంత ఎత్తున్న
విద్యార్థులైనా
నీళ్ళు త్రాగటానికి వీలుగా
వాలుగా ఏర్పాటు చేసిన
కుళాయిలు.
ఛాయా ఠాకూర్,
గుజరాత్.



చివరి తేదీ
31
ఆగస్టు,
2022

last date

# ఆయుర్వేద జ్ఞాన మథనం



- 'వైద్య' ఉమా మహేశ్వర రావు

**కంటిచూపు మందగిస్తున్న వారికి, కంటి జబ్బులు రాకుండా చూసుకునేందుకు కొన్ని చిట్కాలు :**

'సర్వేంద్రియానాం నయనం ప్రధానం' అన్నది సామెత. కంటి చూపు లేకుండా లోకాన్ని చూడలేము. కంటిచూపు మందగించిన తర్వాత డాక్టరు దగ్గరకు వెళ్ళి పరీక్షలు చేయించుకోకుండా అశ్రద్ధ చేయటం వల్ల "గ్లైకోమా" అనే వ్యాధికి ఈమధ్య చాలా మంది గురవుతున్నారు. ఈ వ్యాధి లక్షణాలు కళ్ళు చిన్నవిగా మారిపోవటం, కళ్ళల్లో నీరు కారటం, భరించలేనంతగా కంటిలో నొప్పి వస్తుంటాయి. ఈ జబ్బు రాకుండా కొన్ని చిట్కాలు పాటిస్తే కంటికి చాలా మంచిది.

ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే లోగా చల్లటి నీళ్ళతో కంటి రెప్పల పైన కడుగుతూ వుంటే మంచిది. రాత్రి పడుకునే ముందు స్వచ్ఛమైన ఆవు నెయ్యి కొద్దిగా వేలితో తీసుకుని కళ్ళల్లో కాటుక లాగా పెట్టుకుంటే మంచిది. ఒక గ్లాసు నిండా నీటిని తీసుకుని, అందులో కన్ను ముంచి రెప్పలు రెండుమూడు సార్లు మూసి తెరవటం చేసినట్లయితే కంటిలో వున్న చిన్న చిన్న దుమ్ము, ధూళి లాంటివన్నీ నీటిలోకి పోయి కళ్ళు శుభ్రంగా ఉంటాయి. రోజుకు ఒకటి రెండుసార్లు ఇలా చేస్తే మంచిది. కళ్ళకు ఎదురుగా చూపుడు వేలును ఉంచుకుని, దాన్నే తదేకంగా చూస్తూ, వేలును ముందుకు, వెనకకు రెండుమూడు సార్లు అన్నట్లయితే కంటికి మంచి వ్యాయామం అవుతుంది. ఆ తర్వాత అదే చూపుడు వేలుతో కంటరెప్ప మూసుకుని కన్నుపైన వలయం లాగా రెండుమూడుసార్లు సుతిమెత్తగా రుద్దుకుంటే కూడా కంటికి మంచి వ్యాయామం అవుతుంది.

కంటిచూపు తగ్గకుండా ఉండటానికి మార్గాలు క్యారెట్, క్యాబేజీ, దానిమ్మ, బొప్పాయి, ఎండు ఖర్జూరం, ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవటం మంచిది. వీటిలో 'ఎ', 'కె' విటమిన్‌లు విస్తృతంగా ఉంటాయి కాబట్టి కంటిచూపు తగ్గే అవకాశాలు తక్కువ. కంటిచూపు తగ్గి, కంట్లో ఎటువంటి సమస్యలు ఏర్పడినా, ఎండు ఖర్జూరంలోని గింజ ఒకదాన్ని తీసుకుని, ఒక నాప రాయిమీద కొద్దిగా నీటిచుక్క వేసి, గంధం లాగా అరగదీసి కంటికి కాటుక పెట్టుకున్నట్లు 40 రోజుల పాటు చేసినట్లయితే కంటికి ఏదైనా దెబ్బ తగిలి కనపడకుండా పోయిన చూపు కూడా తిరిగి వచ్చే అవకాశం ఉంటుంది. లేదా పచారీ కొట్టు (మూలికా మందులు అమ్మే షాపు) లో 'చిల్లగింజలు' లభిస్తాయి. వాటిని అరగదీసి కాటుకలాగా పెట్టుకున్నా కంటిచూపు త్వరగా వస్తుంది. కంటికి శుక్లాలు కూడా రాకుండా నివారిస్తుంది.

పౌర్ణమికి 5 రోజులు ముందు, 5 రోజులు తర్వాత కటిక నేలపైన చెప్పులు లేకుండా నిలబడి చంద్రుడిని తదేకంగా చూసినట్లయితే కంటికి చాలా మంచిది. ఇలా చూడటం వల్ల కంటిచూపు మందగించిన వారికి కూడా బాగయినట్లు మన పురాణ తాళపత్ర గ్రంథాలు కూడా చెబుతున్నాయి.

సోపు గింజలు 100 గ్రా., బాదం పప్పు 100 గ్రా., పటిక బెల్లం 100 గ్రాములు తీసుకుని పొడి చేసి ఒక సీసాలో భద్రపరిచి, పెద్దలు ఒక చెంచా, చిన్న పిల్లలు అర చెంచా చొప్పున ప్రతిరోజు ఉదయం సాయంత్రం తీసుకున్నట్లయితే కంటికి సంబంధించిన జబ్బులు దరిచేరే అవకాశం తక్కువ. కంటి జబ్బులు వచ్చిన తర్వాత తగ్గించుకోవటం కన్నా, అవి రాకుండా నివారించుకోవటం మంచిది.

**తలనొప్పి నివారణకు చిట్కా:**

కొంతమంది విపరీతమైన తలనొప్పి భరించలేక డాక్టర్ల చుట్టూ తిరుగుతూ ఉంటారు. అటువంటి వారు బీట్‌రూట్ దుంపను రసం తీసి, అందులో ఒక మెత్తటి కాటన్ గుడ్డను అద్ది, ఆ తడి గుడ్డలు రెండు చెవుల్లో ప్రతిరోజూ కొద్దిసేపు ఉంచుకున్నట్లయితే ఎటువంటి తలనొప్పి అయినా తగ్గిపోతుంది.

**కాళ్ళు, ఒళ్ళు మంటలతో బాధపడే వారికోసం చిట్కా:**

మధుమేహం వల్ల కానీ, ఇతర కారణాల వల్ల కానీ, కొంత మంది అరికాళ్ళు, ఒళ్ళు మంటలతో చాలా ఇబ్బంది పడుతూ ఉంటారు. అటువంటి వాళ్ళు ముల్లంగి రసం చేసుకుని, పిప్పి తీసివేసి, అరకప్పు తాగినట్లయితే ఒళ్ళు మంటలు, కాళ్ళ మంటలు తగ్గిపోతాయి.

**అజీర్తి వ్యాధితో బాధపడే వారికి చిట్కా:**

కొంతమంది చాలాసార్లు అజీర్తి వ్యాధితో బాధ పడుతూ ఉంటారు. అటువంటి వారు ఏ పని చేయాలన్నా మనసు రాక చాలా ఇబ్బంది పడుతూ ఉంటారు. అటువంటి వాళ్ళు ఇంట్లో శొంఠి, బెల్లం కలిపి మెత్తగా పొడి చేసుకుని ఒక సీసాలో భద్రపరచుకొని, ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఒక చెంచా చొప్పున తింటూ ఉంటే అజీర్తి వ్యాధి నుండి త్వరగా ఉపశమనం పొందుతారు.

**అతి దాహం సమస్య నివారణకు చిన్న చిట్కా:**

కొంతమందికి అతిగా దాహం వేస్తూ, ఎక్కువ నీళ్ళు త్రాగుతూ ఉంటారు. ఆ తర్వాత పొట్ట ఉబ్బి చాలా బాధ పడుతుంటారు. అటువంటి వ్యాధి ఉన్నవారు నాలుగు మిరియాలు నోట్లో వేసుకుని, వాటిని చప్పరిస్తూ ఉన్నట్లయితే దాహం ఉండదు, పొట్ట ఉబ్బరం లాంటి సమస్య లేకుండా తమ పనులు చేసుకుంటూ ఉండవచ్చు.

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.
'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం.: 9440286854



- 'వైద్య' కొమెర బాజి

**శరీరంపై చెమట పేరుకుపోయి వచ్చే చెడు వాసన నివారణకు :**

ఎక్కువగా శారీరకంగా శ్రమపడే వారికి, ఎండాకాలంలో ఉక్కపోతవల్ల శరీరంపై చెమటలు పట్టి అది ఎండిన తర్వాత శరీరం నుండి ఒకవిధమైన చెడు వాసన వస్తూ వుంటుంది. ఇది కొందరి విషయంలో మిగతా కాలాల్లో కూడా వస్తూ వుంటుంది. ముఖ్యంగా చంకలలో నుంచి వచ్చే వాసన ఇతరులను కూడా చాలా ఇబ్బందికి గురి చేస్తుంటుంది. ఈ చెడు వాసన నివారణకు ఒక చిట్కాను ఉపయోగిస్తే చాలు చాలా వరకు నివారించ వచ్చు.

ఈ చెమట వాసన నివారణకు 'నేరేడు' చెట్టు లేత ఆకులు, బెరడు తీసుకుని కొద్దిగా కచ్చ కచ్చగా దంచి, ఒక గ్లాసు నీటిలో వేసి వేడి చేసి ఆ నీళ్ళు సగం అయ్యేదాకా మరగనిచ్చి, కషాయం తయారు చెయ్యాలి. ఆ కషాయాన్ని స్నానం చేసే ముందు శరీరానికి పట్టించి స్నానం చేస్తే చాలు. లేదా స్నానం చేసే నీటిలో కలిపి కూడా స్నానం చెసినా సరే ఈ చెమట నుండి వచ్చే దుర్గంధం నుండి విముక్తి పొందవచ్చు. శరీరానికి కూడా చాలా మంచిది.

**వడదెబ్బ నుండి కోలుకోవటానికి :**

వడదెబ్బ వల్ల బాధపడుతున్న వారికి ఒక కప్పు మేక పాలు తీసుకుని, అందులో అరగ్లాసు నీటిని కలిపి, వడదెబ్బ సోకిన వ్యక్తి అరచేతులు, అరికాళ్ళకు బాగా మర్దన పట్టించినట్లయితే వడదెబ్బ నుండి తొందరగా కోలుకుంటాడు.

**చిన్న పిల్లల్లో 'నులిపురుగు'ల వల్ల పొట్టలో వచ్చే ఇబ్బందుల నివారణ :**

చిన్న వయసులో కొంతమంది పిల్లలకు ఆహార లోపం వల్ల పొట్టలో నులి పురుగులు ఏర్పడి పొట్ట లావుగా వుండి చాలా ఇబ్బంది పెడుతూ ఉంటుంది. పొట్ట మందంగా ఉన్నట్టు అనిపిస్తూ ఉంటుంది. అటువంటి వారికి కొద్దిగా ఆముదం తీసుకుని బాగా వేడిగా చేసి, చల్లారిన తర్వాత ఆ ఆముదంతో పొట్టపై బాగా మర్దన చేసినట్లయితే కొద్దిసేపటికే పిల్లలు కోలుకుంటారు. మలం రూపంలో పొట్టలోని పురుగులన్నీ బయటకు వెళ్ళిపోయి ఆరోగ్యంగా ఆడుకుంటారు పిల్లలు.

**ఆయాసం, ఉబ్బసం వ్యాధి నుండి నివారణకు :**

వర్షాకాలం మొదలైంది. ఈ కాలం వృద్ధులు మరియు కొంతమంది చిన్న వయసు వారు కూడా ఆయాసం, ఉబ్బసం వల్ల చాలా ఇబ్బందులు పడుతూ ఉంటారు. ముక్కులు దిబ్బ వేసుకు పోవడం వల్ల ఊపిరి ఆడక నరక యాతన అనుభవిస్తూ ఉంటారు. మారుమూల గ్రామాల వాళ్ళయితే ఈ రోగం వల్ల చనిపోయిన వారు కూడా ఉన్నారు.

ఈ ఆయాసం, ఉబ్బసం నుండి ఉపశమనం పొందడానికి 'అడ్డసరం' అనే మొక్క ఆకులు తీసుకుని మెత్తగా దంచి రసం తీయాలి. ఒక స్పూను అడ్డసరం రసం, ఒక స్పూను అల్లం రసం, ఒక స్పూను తేనె మూడింటిని కలిపి ఉదయం పూట పరగడుపుననే రోజూ సేవించినట్లైతే శరీరంలో వేడి పుట్టి ఆయాసం, ఉబ్బసం వ్యాధి నుండి నివారించ బడతారు. ఇలా పక్షం రోజుల పాటు చేయాల్సి ఉంటుంది.

**చర్మంపైన మచ్చలు, కురుపుల నివారణ కొరకు ఆయుర్వేద వైద్యం :**

కొంతమందికి చర్మముంపైన మచ్చలు, చిన్న చిన్న గుల్లలు, కురుపులు, తామర, గజ్జి, కాలిన గాయాలు లాంటి చర్మ వ్యాధులన్నింటి నివారణకు సులువైన ఆయుర్వేద వైద్యం కలదు. ఈ బాధ నుండి నివారణ పొందటానికి ఉమ్మెత్త ఆకులు తీసుకుని రోట్లో బాగా మెత్తగా దంచి రసం తీయాలి. ఆ రసంలో కొద్దిగా కస్తూరి పసుపు, వేడి చేసిన ఆముదము లేదా నెయ్యి ఒక స్పూను వేసి బాగా కలిపి పేస్టులా తయారు చెయ్యాలి. ఇలా తయారైన పేస్టును చర్మ వ్యాధులు ఉన్నచోట చర్మంపై పూసి ఒక గంట తర్వాత స్నానం చెయ్యాలి. ఇలా పక్షం రోజులు చేసినట్లయితే చర్మ వ్యాధుల నుండి నివారణ పొందవచ్చు.

**చిన్న చిన్న రోగాలు దరిచేరకుండా ఉండటానికి :**

మన శరీరానికి రుతువులు మారినప్పుడల్లా ఏవో చిన్న చిన్న రోగాలు దరి చేరుతూ ఉంటాయి. అలాంటి రోగాలు రాకుండా ముందు జాగ్రత్త పడాలి అనుకునే వారు కేవలం ఒక చిన్న పని చేస్తే చాలు, చిన్న చిన్న రోగాలను దరిచేరకుండా చేసుకోవచ్చు. ఇందుకు చేయాల్సిందల్లా 'జాపత్రి'ని ఒక చిన్న బఠాణీ గింజంత పరిమాణంలో తీసుకుని నోట్లో వేసుకుని చప్పరిస్తూ ఉంటే చాలు చాలా వరకు రోగాలు దరిచేరవు.

**తొలకరి వర్షాలప్పుడు వచ్చే జలుబు నుండి ఉపశమనానికి :**

తొలకరి వర్షాలు మొదలైతే చాలు వాతావరణంలో పూర్తిగా మార్పులు జరగటం వల్ల శరీరం ఆ వాతావరణాన్ని తట్టుకోలేక చాలా మందికి జలుబు, జ్వరం వస్తూ వుంటుంది. డాక్టర్లు కూడా వర్షాకాలం వచ్చిందంటే చాలు జబ్బుల సీజన్ అంటూ ఉంటారు. ఈ కాలం వచ్చే జలుబు నుండి ఉపశమనం పొందటానికి 'మేక పాలు' లేదా ఆవు పాలు ఒక గ్లాసు తీసుకుని, వేడి చేసి, గోరు వెచ్చగా అయిన తర్వాత అందులో కొద్దిగా మిరియాల పొడి, చిటికెడు పసుపు, ఒక స్పూను తేనె, ఒక రెండాడు తులసి రసం ఈ నాలుగింటిని కలిపి త్రాగినట్లయితే జలుబు, జ్వరం నుండి కూడా త్వరగా ఉపశమనం పొందవచ్చు. ఈ వైద్యానికి గేదె పాలు పనికి రావు. ఆవు పాలు లేదా మేక పాలు తప్పనిసరి.

**తేలు మందు :**

పొలం గట్లవద్ద ఉండే గచ్చకాయను పగలగొట్టి లోపలి పప్పును తీసుకుని, కొద్దిగా నీరు పోసి, ఆ పప్పును ఒక బండపైన సాదగా వచ్చిన గంధాన్ని తేలు కుట్టిన చోట శరీరంపై పూసినట్లయితే తేలు విషం త్వరగా తగ్గి పోతుంది. ప్రతి రైతు తమ పొలం గట్లవెంట గచ్చకాయ చెట్లు నాటుకున్నట్లయితే పొలంలోకి పాములు, తేళ్ళు కూడా రాకుండా నివారిస్తుంది. ఇది పొలానికి మంచి కంచెగా కూ ఉంటుంది. గచ్చకాయ చెట్లు సాధారణంగా ఎండిపోవు, గుబురుగా ఉంటాయి కాబట్టి పశువుల నుండి కూడా పంటలను కాపాడుకోవచ్చు.

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' కొమెర బాజి, ఫోన్ నెం. : 9908411700

**ఎడిటర్ గారికి,**

'పల్లెసృజన' పత్రిక చదువుతున్న కొద్దీ ఎంతో ఉత్సాహంగా ఉండటంతో పాటు, మేము కూడా ఏదో ఒక ఇన్నోవేషన్ చెయ్యాలి అన్నంతగా నన్ను ప్రోత్సహిస్తున్నట్లు అనిపిస్తోంది. చిన్న చిన్న ఇన్నోవేషన్లు సామాన్యుడికి అందుబాటులో లభించేలా, సమస్యలను పరిష్కరించేలా ఉన్నాయి. ప్రతి ఇన్నోవేషన్ కథనంలో వాటి పేటెంట్‌కు సబంధించిన సమాచారం కూడా ఇవ్వండి. ఇన్నోవేటర్ తన ఇన్నోవేషన్ రూపు దిద్దుకోవటానికి పడ్డ కష్టాలు చాలా వివరంగా తెలియజేస్తున్నారు. ఇది ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తుందని నా అభిప్రాయం. పల్లెటూర్లో పెద్దగా చదువుకోని వ్యక్తులకు ఇలాంటి ఆలోచనలు రావటం, వాళ్ళు ఇన్నోవేషన్లను తయారు చేయటం చూస్తుంటే ముచ్చటేస్తుంది. 'ఆయుర్వేద జ్ఞానమదనం' శీర్షిక చాలా బావుంది. మన వంటింట్లో లభించే వాటితో లేదా గ్రామాల్లో లభించే వాటితోనే వైద్యం చేసుకునేలా చెప్పడం, చిన్న చిన్న రోగాలకు వైద్యుని వద్దకు వెళ్ళి, వాళ్ళు వ్రాసే అనేక రకాల మందులు కొని, వాటివల్ల సైడ్ ఎఫెక్ట్లు రాకుండా ఎవరికి వారు వైద్యం చేసుకోవటం వల్ల ఎంతో ఖర్చు మిగుల్చుకోవచ్చు. ఈ చిట్కాలను మేము పాటించటంతో పాటు ఇతరులకు చెప్పటం వలన కూడా మాకు కూడా ఎంతో గౌరవంగా ఉంటోంది. ఒక మంచి పత్రిక చదివామన్న తృప్తిని అందిస్తున్నందుకు ధన్యవాదములు. పత్రిక ఆలస్యం కాకుండా త్వరగా మాకు అందేలా చూడగలరు. **– గౌరీశంకర్, వరంగల్.**

**గౌరీ శంకర్ గారూ,**

మీ అభిమానానికి ధన్యవాదములు. మా శీర్షికలు మిమ్మల్ని ఎంతగా ఆకట్టుకుంటున్నాయో మీ మాటల ద్వారా అర్థమవుతోంది. సమాజంలోని ప్రతి ఒక్కరికి విలువైన సమాచారం మన సాంప్రదాయ జ్ఞాన సేకరణ, పల్లెల్లోని సృజనాత్మకత ద్వారా అందించటమే 'పల్లెసృజన' ముఖ్య ఉద్దేశ్యం. పత్రిక ఎటువంటి ఆలస్యం లేకుండా అందరు చందాదారులకు చేరుకునేలా సకల చర్యలూ తీసుకుంటున్నాము. ఒక్కోసారి పోస్టల్ వారి వల్ల ఆలస్యం అవుతోందని మాకు తెలుస్తోంది. ముందు ఇలాంటి సమస్యలు రావని ఆశిస్తున్నాం. **– ఎడిటర్.**

**ఎడిటర్ గారికి,**

నేను 'పల్లెసృజన' పత్రికకు చందా కట్టిన తర్వాత రెండు సంచికలు మాత్రమే అందాయి, మళ్ళీ రావటం లేదు. దయచేసి ఎందుకు అలా జరుగుతోందో పరిశీలించ గలరు. రైతులకు ఎంతో విలువైన సమాచారాన్ని, కొత్త కొత్త ఇన్నోవేషన్లను అందిస్తున్న ఇలాంటి పత్రిక ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తూ ఉంటాము. రైతుల సమస్యలకు ఇంత సులభమైన పరిష్కారాలు కూడా ఉంటాయా? అన్నంత విలువైన సమాచారాన్ని అందిస్తున్నందుకు ధన్యవాదములు. పోస్టలు సిబ్బంది వల్ల పత్రిక ఆలస్యం అవుతుంటే, దయచేసి పత్రికను రిజిష్టర్ పోస్టు ద్వారా పంపండి. అదనపు ఛార్జీలు కూడా మేము చెల్లించ గలము. కానీ, ఇటువంటి విలువైన పత్రిక రాకుండా ఉండటం కొంత బాధాకరంగా ఉంటుంది. పత్రికలో ఇన్నోవేటర్ల గురించి, యంత్ర పరికరాల గురించి, ఆయుర్వేద వైద్యం గురించి, వైద్యం ఎలా చేసుకోవాలి, ఆయుర్వేద మందులు ఎలా తయారు చేసుకోవాలి లాంటి అన్ని వివరాలు చాలా సంతృప్తికరంగా ఉంటున్నాయి. ఈ పత్రిక వల్ల మాకు ఎంతో మంది కొత్త వారితో విలువైన పరిచయాలు పెరుగుతున్నాయి. **– మనోహరాచారి, చౌదరిగూడెం, రంగారెడ్డి జిల్లా.**

**మనోహరాచారి గారూ,**

'పల్లెసృజన' పత్రిక పట్ల మీకున్న అభిమానానికి కృతజ్ఞతలు. పత్రిక మీకు సమయానికి చేరకపోవటం మాకూ బాధగానే ఉంది. ఈ సమస్యను పోస్టాఫీసు వారికి తెలియజేసి, తప్పక పత్రిక అందేలా చర్యలు తీసుకుంటాము. రిజిష్టర్ పోస్టు సలహా బావుంది. అది కొంచెం ఆర్థికంగా భారంగా ఉంటుంది. పాఠకులందరి అభిప్రాయాలు, సలహాలు తీసుకుని ఒక నిర్ణయానికి వద్దాం. **– ఎడిటర్.**


## FORM IV

***Statement about ownership and other particulars about newspaper (PALLE SRUJANA)***

| | | |
|---|---|---|
| 1. Place of publication | : | **102, Vayupuri, Sainikpuri Post,** Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Teelangana |
| 2. Periodicity of its publication | : | **Bi-Monthly** |
| 3. Printer's Name | : | **P. Ganesham** |
| Nationality | : | Indian |
| Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 4. Publisher's Name | : | **P. Ganesham** |
| Nationality | : | **Indian** |
| Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 5. Editor's Name | : | **J. Seshi Mohan** |
| Nationality | : | **Indian** |
| Address | : | 2-1-513/2, Nallakunta, Hyderabad - 500 044. |
| 6. Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | | |

I, **P. GANESHAM**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date28-02-2017

**Signature of Publisher**

పల్లెసృజన
www.pallesrujana.org

# అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల ఇన్నోవేషన్లు

ఇన్నోవేటర్ : **వెంకటయ్య**, మహబూబ్‌నగర్

ఇన్నోవేటర్ : **విజయ్‌భూషణ్ రెడ్డి**, గుంటూరు

## మినీ రైస్ మిల్



గ్రామాల్లో పండిన ధాన్యాన్ని సమీప పట్టణాలకు తరలించి బియ్యం పట్టించాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఈ సమస్య పరిష్కరించడమే కాక, ఈ మినీ రైస్‌మిల్‌లో వరి ధాన్యంతో పాటు, కొర్రలు, గోధుమలను కూడా మర ఆడించ వచ్చు. గోధుమలకు పై పొట్టును మాత్రమే తీస్తుంది. వడ్లను వినియోగ దారునికి అవసరమైనంత వరకు బియ్యంగా మార్చి పాలిష్ కూడా చేస్తుంది. కేవలం 12 అడుగుల పొడవు వెడల్పు వున్న గదిలో సింగల్ ఫేస్ కరెంటుతోనే ఇది పని చేస్తుంది.

## మొబైల్ పంక్చర్ షాప్

ఇన్నోవేటర్ : **ఇస్మాయిల్**, కృష్ణా జిల్లా



సాధారణంగా పంక్చర్ షాప్‌లను పట్టణాలు లేదా పెద్ద గ్రామాల్లో ఒక చోట ఏర్పాటు చేసుకుని ఉంటారు. ఏ వాహనం పంచర్ అయినా సరే వారి వద్దకే వచ్చి పంచర్ వేయించుకుని, గాలి కొట్టుకుని పోవాల్సి వుంటుంది. ఈ సమస్యలకు చెక్ పెడుతూ ఏర్పాటైనదే ఈ మొబైల్ పంచర్ షాప్. పెద్ద వాహనాలైనా, చిన్న వాహనాలైనా సరే ఫోన్ చేసిన వెంటనే అక్కడికే వెళ్ళి పంక్చర్ వేసి, గాలి కూడా కొట్టి రావచ్చు. నిరుద్యోగులకు ఇదొక మంచి స్వయం ఉపాధి.



## మొబైల్ వెల్డింగ్ షాప్

ఇన్నోవేటర్ : **అన్నపురెడ్డి రాముడు**, గుంటూరు

పూర్వం లాగా ఇప్పుడు గ్రామాల్లో కల్లాలకు కంతలు, ఇళ్ళకు వాకిండ్లు చెక్కతో కాకుండా ఓకసారి శాశ్వతంగా ఉంటుందని ఇనుముతో చేయిస్తున్నారు. పట్టణాల వారైతే ఫర్వా లేదు ఏదైనా వెల్డింగ్ ఊడిపోయినపుడు ఎవరినో ఒకరిని తీసుకుని వచ్చి చేయించుకుంటారు. ముఖ్యంగా గ్రామాల్లోనివారు దాన్ని వెల్డింగ్ చేయించాలంటే వాటిని తీసుకు వెళ్ళి తీసుకు వచ్చే ఖర్చు చాలా అవుతుంది. ఇటువంటి సమస్యల పరిష్కారానికి ఏర్పాటైనదే 'మొబైల్ వెల్డింగ్'. నిరుద్యోగులు ఒక వాహనాన్ని ఏర్పాటు చేసుకుని అందులో ఆర్క్ వెల్డింగ్ మిషన్, గ్యాస్ వెల్డింగ్ పరికరాలు వేసుకుని రోజుకో వైపు తిరుగుతూ వుంటే అక్కడికక్కడే వెల్డింగ్ చేయటం వల్ల వీరికి ఉపాధి, వినియోగ దారునికి తక్కువ ఖర్చుతో తమ సమస్య పరిష్కారం అవుతుంది.

ఇన్నోవేటర్ : **పటాన్ సైదా**, గుంటూరు

## ఎలక్ట్రిక్ ఆటో







గ్రామీణ రవాణా వ్యవస్థకు అవసరమైన, చవకైన రవాణా సాధనం ఈ 'ఎలక్ట్రిక్ ఆటో'. రోజు రోజుకూ పెరిగి పోతున్న పెట్రోల్, డీజిల్ ధరలను భరించే శక్తి గ్రామీణులకు ముఖ్యంగా రైతులకు ఉండదు. రాత్రి పూట 3 గంటల సేపు ఛార్జింగ్ చేసుకుంటే చాలు దాదాపు 5–6 గంటలకు పైగా ప్రయాణం చేయవచ్చు. కూలీల తరలింపు, పొలం దిగుబడులను, ఎరువులను రవాణా చేసేందుకు, ఎంతో చవకగా పని చేసుకోవచ్చు. గ్రామాల్లో నిరుద్యోగులు ఇలాంటి ఆటో ఒక్కసారి ఖర్చు చేసి కొనుగోలు చేసి, ప్రతిరోజూ శ్రద్ధగా బ్యాటరీని చూసుకుంటూ, సరియైన సమయంలో ఛార్జింగ్ చేసుకుంటూ వుంటే చాలు. అతి తక్కువ ఖర్చుతో గ్రామాల్లో రవాణా వ్యవస్థకు మీరు తోడుగా ఉంటూ, మీ ఉపాధిని కూడా పొందవచ్చు. చెత్త సేకరణకు కూడా ఎటువంటి ఖర్చు లేకుండా ఈ వాహనం ద్వారా చెత్తను సేకరించుకోవచ్చు. ముఖ్యంగా నిర్వహణా ఖర్చులు చాలా తక్కువగా ఉంటాయి.

కావలసిన వారు సంప్రదించండి : బి. సుభాష్ చందర్, ఫోన్ : 9652801700

PALLE SRUJANA Telugu Bi-monthly May - June 2022 RNI No. TELTEL 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30 /-లు మాత్రమే

ఇన్నోవేషన్ల వీడియోల కొరకై ఈ QR కోడ్‌ను స్కాన్ చేసి చూడవచ్చు.


























పల్లెసృజన సభ్యులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. సభ్యులుగా చేరాలనుకున్నవారు చందా కట్టి, మీ చిరునామాను స్పష్టంగా 9866001678 కి పంపడం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-40253096
లేదా నేరుగా ఈ బ్యాంక్ లో జమ చేయండి.

**M/s Pallesrujana, Canara Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : CNRB0013023**

"Phone Pe"
no 9866 00 1678

QR code for Phone Pe

## సభ్యత్వ వివరాలు

| వివరములు | వ్యక్తిగతం | లైబ్రరి |
|---|---|---|
| రెండు సంవత్సరాలకి | 400/- | 1,000/- |

'గూగుల్ పే' చెయ్యాలనుకున్న వారు 9652801700 నెంబరుకు పంపి మీ చిరునామా ఎస్ఎంఎస్ లేదా వాట్సయాప్‌లో పంపండి.